www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
13-07-2024

సంపుటి : 01 | సంచిక : 70 | పేజీలు : 12 | వెల : 5/-  తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V6 NEWS



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## ఉద్యమకారులు ఎవరూ అధైర్యపడొద్దు

### అందరికీ తగిన న్యాయం జరిగేంత వరకు పోరాడుతా..

కాంగ్రెస్ మానిఫెస్టోలో ఉద్యమకారులకు పెట్టిన ప్రతి పథకాన్ని అందేలా చూస్తా

ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం



**విశ్వంభర, కొత్తపేట :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర ఎనలేదని ప్రొఫెసర్ కోదండరాం కొనియాడారు. గత ప్రభుత్వం ఉద్యమ కారులను పక్కన పెటిందని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని మిగతా3లో...

లోక్‌సభ ఎన్నికల టార్గెట్ ఛేదించారు. ఇక లోకల్ వార్‌లో సత్తా చూపాలని కమలం పార్టీ తహతహలాడుతోంది. స్థానిక ఎన్నికల సమరానికి సమాయత్తం అవుతోంది కాషాయ దళం. ఫోకస్ లోకల్ అనే నినాదంతో ముందుకు సాగుతోంది. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే ఏది దారి? స్థానిక సంస్థల ఎన్నికలే రహదారి. మార్గం బోధపడింది. ఇక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది తెలంగాణ బీజేపీ. లోక్‌సభ టూ అసెంబ్లీ వయా లోకల్ బాడీస్ అనే వ్యూహంతో అడుగులు వేస్తోంది బీజేపీ. పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించి, కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టింది ఎన్డీయే సర్కార్. గత ఎన్నికలతో పోలిస్తే, ఈసారి ఎన్నికల్లో రెట్టింపు ఎంపీ స్థానాలతో డబుల్ ధమాకా సాధించింది బీజేపీ. 8 లోక్‌సభ సీట్లు సాధించి విజయ బావుటా ఎగరేసింది. ఎంపీ ఎన్నికలు ఇచ్చిన జోష్‌తో కొత్త టార్గెట్‌ను ఫిక్స్ చేసుకుంది తెలంగాణ బీజేపీ. కొద్ది నెలల్లో తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల సమరానికి సై అనడానికి సమాయత్తం అవుతోంది. ఆ దిశగా పార్టీ లీడర్లు, కేడర్‌కు దిశా నిర్దేశం చేసింది.



# బీజేపీ స్థానిక సమరం

## పక్కా స్కెచ్‌తో కమలం అడుగులు

లోకల్'నినాదంతో ముందుకు.. | టార్గెట్ ఫిక్స్ చేసిన అగ్రనేతలు | బీజేపీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వ్యూహాత్మక నిర్ణయాలు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇందులో భాగంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. శంషాబాద్ మల్లిక కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి, అధిష్ఠానం తరపున కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ డీకే అరుణ, ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలు సమావేశానికి హాజరయ్యారు. తెలంగాణలో బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు మిగతా2లో...

## బిడ్డను అమ్మేసిన కసాయి తండ్రి

- లక్ష రూపాయలకు కర్ణాటక వాసికి విక్రయం
- తల్లడిల్లిన పాప తల్లి.. పోలీసులకు ఫిర్యాదు
- 24 గంటల్లో తల్లి ఒడికి చేర్చిన పోలీసులు
- పాతబస్తీలోని మొహమ్మద్ నగర్‌లో ఘటన



2

## తెలంగాణకు జలుబు, జ్వరం

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- కనీస పారిశుద్ధ్యం లేక ఇబ్బందులు
- ఆస్పత్రుల బాటపడుతున్న రోగులు
- దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు



4

## కాంగ్రెస్‌లో చేరిన ప్రకాష్ గౌడ్

- కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలుపు
- గులాబీ పార్టీకి వరుసగా షాక్‌లిస్తున్న ఎమ్మెల్యేలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు వరుస షాకులు తగులుతున్నాయి. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు మిగతా2లో...

## తెలంగాణ ప్రభుత్వం హిందు విరోధి

- మోడీ ఉన్నంత కాలం రిజర్వేషన్లకు ఢోకా ఉండదు
- బీజేపీలో సామాన్య కార్యకర్త కూడా సీఎం కావచ్చు
- ఈటల రాజేందర్ పాత నాయకుడే..
- తెలంగాణలో బీజేపీని నంబర్ వన్‌గా మారుస్తాం
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



2

## బ్రాహ్మణ పరిషత్ ఉన్నట్టా? లేనట్టా?

- అగమ్యగోచరంగా బ్రాహ్మణ పరిషత్ పరిస్థితి
- బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్
- సీఎంకు రాసిన లేఖలో మాజీ మంత్రి హరీష్ రావు



2

## కేసీఆర్‌ను జైలుకు పంపడమే నా లక్ష్యం

- త్వరలో బీజేపీలోకి హరీష్ రావు
- జగదీశ్ రెడ్డి జైలుకు వెళ్లే వ్యక్తి
- జైలుకు వెళ్లే వ్యక్తులను కాంగ్రెస్‌లో చేర్చుకోం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

2

## త్వరలో బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం

- ఆ పార్టీలో మిగిలేది నలుగురు ఎమ్మెల్యేలే..
- బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలకు విలువ ఉండదు
- దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు



2

## పాలమూరులో కారు ఖాళీ?

- ఇప్పటికే పార్టీ మారిన ఒక ఎమ్మెల్యే
- మిగిలిన ఒక్క ఎమ్మెల్యే కూడా మారే ఛాన్స్..?
- అయోమయంలో బీఆర్ఎస్ కేడర్



**విశ్వంభర, మహబూబ్ నగర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో గులాబీ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 108 | ₹ 131 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 190 | ₹ 216 |

## నిరుద్యోగులతో మాట్లాడే దమ్ముందా?

### రాహుల్ గాంధీకి బండి సంజయ్ సవాల్

- ఓయూలో తిరగాలంటూ డిమాండ్
- తెలంగాణలో అంటువ్యాధిలా వ్యాపిస్తోన్న నిరుద్యోగం



**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందని రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మీ పార్టీయే తెలంగాణలో అధికారంలో మిగతా2లో...

## బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి

2వేల చదరపు కి.మీ పరిధిలో హైడ్రా విధులు

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

విధివిధానాలపై అధికారులకు సూచనలు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సచివాలయంలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్)పై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మిగతా2లో...

## బ్రాహ్మణ పరిషత్ ఉన్నట్టా? లేనట్టా?

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణ పరిషత్ పరిస్థితి అగమ్యగోచరం కావడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, స్వయం ఉపాధి, వేద విద్యకు ప్రోత్సాహం కోసం అమలు చేసిన వివిధ పథకాలు ఆగిపోవడం విచారకరమని ఆయన అన్నారు. అసలు బ్రాహ్మణ పరిషత్ ఉన్నట్టా? లేనట్టా? అనే ఆందోళన బ్రాహ్మణ సామాజిక వర్గంలో నెలకొందని హరీష్ రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేసే పథకాలు నిలిచిపోయాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎంతో మంది పేద బ్రాహ్మణులకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని అంటూ హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

## బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి

**(మొదటి పేజీ తరువాయి)**
ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా విధివిధానాలపై చర్చ జరిగింది. హైడ్రా విధివిధానాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల చదరపు కి.మీ పరిధిలో హైడ్రా విధులు నిర్వహించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలి. అపరాధ రుసుము వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయించాలని ఆదేశించారు. జోన్ల విభజనలో పోలీస్ స్టేషన్ పరిధులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిధులు పూర్తిగా ఒకే జోన్‌లో వచ్చేలా జాగ్రత్త వహించాలన్నారు సీఎం. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినతరం చేసేలా అధ్యయనం చేయండని అధికారులను సీఎం ఆదేశించారు.హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండేలా చూడాలి. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి. అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించండి. అసెంబ్లీ సమావేశాల్లోగా పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించండని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు.

## త్వరలో బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం

**విశ్వంభర, హైదరాబాద్ :** త్వరలో బీఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కాబోతుందంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన నాగేందర్ ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్‌ను కలవాలంటే ఎమ్మెల్యేలకు కూడా అవకాశం దక్కేది కాదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, అందుకే ఎమ్మెల్యేలు ఈ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యేలకే నమ్మకం లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలకు విలువ ఉండదని అన్నారు. కాంగ్రెస్‌లో అందరికీ విలువ ఉంటుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఉండేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి అసలు ఫండే లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని అన్నారు. వాటి వివరాలు త్వరలో బయట పెడతానని తెలిపారు. కేటీఆర్ బినామీలు వేలాది కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామని మేకపోతు గాంభీర్యం చూపుతున్నారని చెప్పారు.

## కేసీఆర్ ను జైలుకు పంపడమే నా లక్ష్యం



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ సమాధి అయిందని ఆ పార్టీలో ఎవరూ మిగలరని అన్నారు.ఎమ్మెల్యే హరీశ్ రావు సైతం బీజేపీలోకి వెళ్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ను జైలుకు పంపడమే నా మరో లక్ష్యం అని ఆయన హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జైలుకు వెళ్లే వ్యక్తి..జైలుకు వెళ్లేవారిని మేం కాంగ్రెస్‌లో చేర్చుకోమని అన్నారు. కాగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. త్వరలోనే మరికొంత మంది బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి చేరేందుకు రెడీ ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ఆ పార్టీని వీడి ఇతర పార్టీలో చేరుతారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతున్నాయి.

## ఆ రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు : మంత్రి పొంగులేటి




**విశ్వంభర, హైదరాబాద్ :** రైతును రాజును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఇవాళ వనపర్తిలో నిర్వహించిన పంట పెట్టుబడి పథకం రైతు భరోసాపై నిర్వహించిన సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు,తుమ్మల నాగేశ్వర రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గతంలో 4 గోడల మధ్య కూర్చొని నిర్ణయాలు తీసుకుకున్నారని విమర్శించారు.కొండలు, గుట్టలు, భూస్వాములు, లేఔట్, ఫాంహౌస్ లకు రైతుబంధు పెట్టుబడిని ఇచ్చారని ఆయన ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల మధ్యకు పోయి వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. 10 ఎకరాల వారికి, ఐటీ రిటర్న్, ఐటీ చెల్లించే వారికి ఇవ్వరని ప్రతిపక్షాలు రైతులను భయపెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి అన్నారు. రైతులు, కౌలు రైతులు ఇలా అందరి దగ్గర అన్ని రకాల సూచనలు తీసుకుని రైతులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. రైతు భరోసా పై ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రజల, రైతు సంఘాల నుంచి మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయాలు సేకరిస్తుందని ఆయన తెలిపారు.

# పాలమూరులో కారు ఖాళీ..?

**(మొదటి పేజీ తరువాయి)**
పరాభవం మూటగట్టుకున్న బీఆర్ఎస్.. అనంతర పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఉమ్మడి జిల్లాలో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరు ఇప్పటికే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, మిగిలిన ఒక్కరు కూడా త్వరలోనే పార్టీని వీడతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీతో కలిసి అధికార పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారట..! ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ గెలిచిందే ఇద్దరు ఎమ్మెల్యేలు. వారిలో ఇప్పటికే ఒకరు కాంగ్రెస్ లో చేరారు. మరో ఎమ్మెల్యేతో పాటు, ఎమ్మెల్సీ సైతం అదేబాటలో ప్రయాణానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో పూర్వపు మహబూబ్ నగర్ జిల్లాలో బీఆర్ఎస్ కు కోలుకోలేని షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసలే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దారుణ ఓటమితో కుంగిపోయిన బీఆర్ఎస్ శ్రేణులకు వేగంగా మారుతున్న ఈ రాజకీయ పరిణామాలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డి – ఎమ్మెల్సీ చల్లా భేటీ?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచింది కేవలం రెండే స్థానాలు అవి కూడా నడిగడ్డలోని అలంపూర్, గద్వాల్. ఇటీవలే రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కారు దిగి హస్తం పార్టీలో చేరిపోయారు. ఇక అదే బాటలో గద్వాల్ కు అనుకొని ఉన్న అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి సైతం కాంగ్రెస్ లో చేరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి భేటీ అవ్వడం ఈ ప్రచారానికి బలమైన ఆధారాలు లభించినట్లు అయ్యింది. అలంపూర్ నియోజకవర్గానికి చెందిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ చల్లా సీఎంను కలిశారని చెబుతున్నప్పటికీ, అసలు కారణం పార్టీలో చేరికపై ఇరువురు చర్చించారని టాక్ నడుస్తోంది. ఇక త్వరలోనే ముహూర్తం చూసుకొని కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని నియోజకవర్గంలో చర్చల మీద చర్చలు నడుస్తున్నాయి. ఎమ్మెల్సీ చల్లా తోపాటు ఆయన అనుచరుడు అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని జోరుగా ప్రచారం నడుస్తోంది.



### విజేయుడు ఒక్కడే దిక్కు

బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం ఉన్న ఏకైక ఎమ్మెల్యే విజేయుడు సైతం పార్టీ మారితే త్వరలోనే పాలమూరు జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున శాసనసభకు ప్రాతినిధ్యం ఉండకపోవచ్చు. అదే జరిగితే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలినట్టేనని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇప్పటికే వరుస ఎన్నికల్లో ఓటమితో కుంగిపోతున్న బీఆర్ఎస్ శ్రేణులకు ఈ పరిణామాలు మూలిగే నక్కపై మూడో తాటిపండు పడ్డట్టు ఉంటుదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గతమెంతో ఘనం వర్తమానం మాత్రం శూన్యం అన్నట్లు ఉంది ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో గులాబీ పార్టీ పరిస్థితి. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు జిల్లాలో బీఆర్ఎస్ ను ఖాళీ చేసేలా కనిపిస్తున్నాయి..!

# బిడ్డను అమ్మేసిన కసాయి తండ్రి



**విశ్వంభర, హైదరాబాద్:** నవమాసాలు మోసి కన్నబిడ్డలను తమ అవసరాల కోసం అమ్మేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. శిశువులను అంగడి సరుకుల మాదిరిగా విక్రయిస్తున్న ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఓ పసికందును విక్రయించిన ఘటన హైదరాబాద్ మహానగరంలో కలకలం రేపుతోంది.అమ్మ ప్రేమను అందుకోలేని దీనస్థితి ఆ చిన్నారిది. తండ్రి లాలనకూ నోచుకోని దుస్థితి ఆ శిశువుది. తల్లిదండ్రుల సంరక్షణలో హాయిగా ఎదగాల్సిన ఆ పసిపాపను కన్న తండ్రే అంగట్లో బొమ్మలా ఇతరులకు అమ్మే ప్రయత్నం చేశారు. హైదరాబాద్ మహానగరంలో వెలుగు చూసిన ఈ అమానుష ఘటన ఆడపిల్లల పట్ల వేళ్లూనుకొన్న వివక్షకు అద్దం పడుతోంది. మగ పిల్లాడు పుడితే సంబురాలు చేసుకుంటూ.. ఆడపిల్ల పుడితే భారంగా భావించే వాళ్లు చాలామందే ఉన్నారు. పుట్టింది ఆడపిల్ల అని తెలియగానే వద్దనుకుంటున్నారు. పురిటిలోనే వదిలేసి వెళ్లిపోతున్న పరిస్థితి. మరికొందరు తమకు ఆడబిడ్డ వద్దు అంటూ కన్న తల్లిదండ్రులే వేరే వాళ్లకు విక్రయిస్తున్నారు.

**శిశువును కాపాడిన అమ్మప్రేమ**

తాజాగా పేదరికం ఆ కుటుంబాన్ని ఎంతటికైనా తెగించేలా చేసింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఏకంగా ముక్కు పచ్చలారని శిశువును విక్రయించేశారు. హైదరాబాద్ పాతబస్తీలో నవజాతి శిశువు అమ్మకం కలకలం రేపింది. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొహమ్మద్ నగర్ ప్రాంతంలో అసిఫ్, అస్మా దంపతులు నివసిస్తున్నారు. అసిఫ్, తన భార్య అస్మాను బెదిరించి వారి 18రోజుల పాపను కర్ణాటక రాష్ట్రానికి చెందిన మినాల్ సాద్‌కు అమ్మేందుకు బేరం కుదుర్చుకున్నాడు. లక్ష రూపాయలకు చాంద్ సుల్తానా అనే మహిళ ద్వారా విక్రయించాడు. వెంటనే అస్మా బండ్లగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయంతో విషయం వెలుగులోకి వచ్చింది.కేసు నమోదు చేసుకున్న బండ్లగూడ పోలీసులు 24 గంటల లోపే ఛేదించారు. 18రోజుల పసికందును కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి రక్షించి తల్లికి అప్పగించారు. ఈ కేసులో బాలిక తండ్రి అసిఫ్, మధ్యవర్తి చాంద్ సుల్తానా, బాలికను కొన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన మినాల్ సాద్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 24గంటల్లో కూతురు అస్మా బేగం కు చేరడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పోలీసులకు బాధిత కుటుబ సభ్యులు, స్థానికు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వం హిందు విరోధి



**విశ్వంభర, హైదరాబాద్:**నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్నన్ని రోజులు రిజర్వేషన్లకు ఎలాంటి ధోకా ఉండదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ రాజ్యాంగాన్ని తరచూ అవమానపరుస్తోందన్నారు. ఎన్డీఏ అధికారంలో ఉన్నన్ని రోజులు రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ విరోధి అని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ కోసం బీజేపీ మద్దతిచ్చిందని గుర్తు చేశారు. బీజేపీలో సామాన్య కార్యకర్త ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్యుడే ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. బీజేపీలో చేరిన వారంతా పాత నాయకులే అన్నారు. ఈటల రాజేందర్ పార్టీలో కొత్త నాయకుడు కాదని... ఆయన పాత నేత అయిపోయారన్నారు. దక్షిణ భారతంలో బీజేపీ బలపడిందన్నారు. తెలంగాణ, ఏపీలలో గతంలో కంటే మంచి సీట్లు గెలుచుకున్నామని, కేరళలో బీజేపీ ఖాతా తెరిచిందని, తమిళనాడులో మెరుగైన ఓటు బ్యాంక్ సాధించామన్నారు. తెలంగాణలో బీజేపీని నెంబర్ వన్ పార్టీగా మార్చేందుకు తమ వద్ద 1500 రోజుల ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్రంలో పోలింగ్ బూత్ లెవెల్‌లో బీజేపీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో కొత్త, పాత అన్నది లేదని తేల్చి చెప్పారు. గత పదేళ్లుగా ఒక కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌బీఆర్ఎస్‌లకు నిద్ర పట్టకుండా చేస్తేనే బీజేపీ ఫస్ట్ స్థానంలోకి వస్తుందని సమావేశానికి హాజరైన నేతలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఊర్లో ఉన్న ప్రతి సమస్యను బీజేపీ కార్యకర్త సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. టాప్ 5 ఎకనామిక్ సిటీస్‌లో హైదరాబాద్ ఉందన్నారు.

# ఇష్టం లేకుంటే ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవచ్చు

## శ్రీనివాస్ గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేల అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. పార్టీ మారే వారంతా తొందరపడుతున్నారన్నారు. ఇష్టం లేకుంటే ఎమ్మెల్యేలు వెళ్లిపోవచ్చునని... కానీ తల్లి లాంటి పార్టీని విమర్శించవద్దని సూచించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే కాదు... ఇంకా 14 పార్టీలకు సీట్లు రాలేదని గుర్తు చేశారు. మోదీ కావాలా? వద్దా? అనే ప్రాతిపదిక మీద లోక్ సభ ఎన్నికలు జరిగాయన్నారు. రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారు ఈ విషయాలు గుర్తిస్తారని పేర్కొన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతమంది పార్టీ ఉండదని శాపనార్థాలు పెడుతున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. తమ పార్టీకి ఒడిదొడుకులు కొత్తకాదని, ఒకసారి ఓడిపోగానే పార్టీల పని అయిపోతుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఉద్యమంలో కూడా చంపాలని చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. ఇప్పుడు కూడా బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలనే కుట్రలు సఫలం కావన్నారు. ఓడిపోయినంత మాత్రాన ఏదో జరుగుతుందని ఊహించుకోవద్దన్నారు. బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలే కాపాడుకుంటారన్నారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తిరిగి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని సవాల్ చేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. బీఆర్ఎస్‌కు గొప్ప ఉద్యమ చరిత్ర ఉందని, త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ అన్నారు. ఉద్యమంలో భాగంగా అనేక సార్లు రాజీనామాలు చేసిన చరిత్ర తమ పార్టీకి ఉందన్నారు. స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఫలితాలు పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లా ఉండబోవన్నారు. ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లో మంచి నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు 60 లక్షల మంది సభ్యత్వం ఉందని, ఆషామాషీగా తుడిచి పెట్టలేరన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలంటే బీఆర్ఎస్‌ను కాపాడుకోవాలని ప్రజలకు తెలుసునన్నారు. దేశంలో అభివృద్ధికి తెలంగాణ రోల్ మోడల్ అయ్యిందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌లో చేరిన ప్రకాష్ గౌడ్

**(మొదటి పేజీ తరువాయి)**
ఎప్పుడు ఆ కండువా తీసేసి.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరగా.. తాజాగా జీహెచ్ఎంసీ పరిధిలోని మరో ఎమ్మెల్యే సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. వరుస పెట్టిన కారు దిగి హస్తం గూటికీ చేరుతున్నారు నేతలు. కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తోపాటు వివిధ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. ప్రకాశ్ గౌడ్ బీఆర్ఎస్ ను వీడతారంటూ గతంలోనే పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ మారడం లేదని వివరణ ఇచ్చారు. చివరికి శుక్రవారం రాత్రి కాంగ్రెస్ లో చేరారు. ఇదిలావుంటే, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. అయితే ఒక్కొక్కరుగా కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు.

## బీజేపీ స్థానిక సమరం

**(మొదటి పేజీ తరువాయి)**
లోకల్ బాడీ ఎన్నికలే టార్గెట్ గా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థానిక సమరానికి..కమలం కేడర్‌ని కదం తొక్కించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే దిశగా సమాలోచనలు నిర్వహించారు.

**రాజకీయ వ్యూహంతో మరో 4 తీర్మానాలు..**


ఢిల్లీ గద్దె మాది. ఇక తెలంగాణలో గల్లీ స్థాయిలో కూడా విజయం సాధిస్తాం అంటున్నారు కమల నాథులు. రాబోయే స్థానిక సమరానికి కేడర్‌ని సమాయత్తం చేసే దిశగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కార్యవర్గ సమావేశంలో నాలుగు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఎనిమిది ఎంపీ సీట్లలో గెలిపించినందుకు తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ మొదటి తీర్మానం చేశారు. ఇక మూడోసారి ప్రధానిగా ఎన్నికైన మోదీకి అభినందనలు తెలుపుతూ మరో తీర్మానం పెట్టారు. రాజకీయ వ్యూహంలో భాగంగా 6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం చెందిందంటూ ఇంకో తీర్మానం పెట్టారు. ఇక రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ మరో తీర్మానం చేశారు. ఇక ఇదే వేదికగా స్థానిక సంస్థల్లో బీజేపీ భారీ విజయం సాధించాలని నేతలు ఆకాంక్షించారు.

## నిరుద్యోగులతో మాట్లాడే దమ్ముందా?

**(మొదటి పేజీ తరువాయి)**
ఉంది కదా... ఉస్మానియా యూనివర్సిటీలో తిరిగే దమ్ముందా? అంటూ సవాలు విసిరారు. ఓయూకి వెళ్లి నిరుద్యోగులను కలిసి వాళ్ల సమస్యలపై మాట్లాడగలరా అని ప్రశ్నించారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ సమీపంలోని మల్లికా కన్వెన్షన్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాలను గుర్తించి బీజేపీకి 8 ఎంపీ సీట్లు అందించారని తెలిపారు. తెలంగాణలో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తుందని బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచి ఏడు నెలలైనా ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే అంటువ్యాధి లాంటిదని మండిపడ్డారు. మోదీ రోజ్ గార్ మేళాతో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోందని అయినా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా విస్తరిస్తోందని రాహుల్ గాంధీ చెప్పడం సిగ్గు చేటు అని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు, బీజేపీకి విడదీయరాని బంధం ఉందని అన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష్మణ్ ఆధ్వర్యంలో 4 ఎంపీ సీట్లను అందించారు. మొన్నటి ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు, 8 ఎమ్మెల్యే సీట్లు అందించి కాంగ్రెస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం అని నిరూపించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను చూసి మోసపోయామని తెలుసుకున్న ప్రజలు 8 ఎంపీ సీట్లు గెలిపించి మోదీకి పట్టం కట్టారని తెలిపారు. మోదీ ప్రభుత్వం మళ్లీ వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదని అన్నారు. కార్యకర్తల కష్టార్జితంతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని బండి సంజయ్ తెలిపారు. కార్యకర్తలు తమ భుజంపై కాషాయ జెండాను మోశారని.. వారందరికీ తన సెల్యూట్ తెలిపారు.



# ఉద్యమకారులు ఎవరూ అధైర్యపడొద్దు



(మొదటి పేజీ తరువాయి)
బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో ఉద్యమ కారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమ మానిఫెస్టోలో ఉద్యమకారులకు పెట్టిన ప్రతి పథకాన్ని అర్హులైన ఉద్యమకారులకు అందేలా తమ ప్రయత్నం ఉంటుందని అన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందుతాయని ఉద్యమకారులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు వచ్చే వరకు తాను పోరాడతానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



## ఉద్యమ ఆశయాలు ఇప్పటికీ నెరవేరలేదు

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర ఎనలేనిదని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ అన్నారు. సబ్బండ వర్గాలు సమష్టిగా, స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నాయని గుర్తుచేశారు. రాస్తారోకోలు, సకల జనుల సమ్మె, వంటావార్పు, కళాకారుల ఆటాపాటలతో దూంధాంలలో పాల్గొని ఉద్యమాన్ని ఉవ్వెత్తున నిలిపారని కొనియాడారు. తెలంగాణరాష్ట్రం సాధించుకొని దశాబ్ది కాలం అవుతున్న ఉద్యమ ఆశయాలు ఇప్పటికీ నెరవేరలేదన్నారు. గత పదేళ్ల కాలములో ఉద్యమకారులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్, హెల్త్ కార్డులు అందేలా ప్రొఫెసర్ కోదండరాం సార్ చొరవ తీసుకోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## ఉద్యమకారులకు గౌరవం ఏది..?

తెలంగాణ ఉద్యమంలో తనపై అనేక రైల్వే కేసులు పెట్టారని అరుణోదయ విమలక్క చెప్పారు. 25 రోజుల పాటు చంచల్‌గూడ జైలులో ఉన్నానని తెలిపారు. పోలీసుల లాఠీదెబ్బలకు వెరవకుండా, కేసులకు బెదిరిపోకుండా రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాగా ఉద్యమకారులు ఉద్యమించారన్నారు. అన్ని పనులు వదులుకుని, అవసరాన్ని బట్టి ఆస్తులు అమ్ముకుని ఉద్యమాన్ని నడిపించారు. లక్ష్యాన్ని ముద్దాడారు. కానీ వాళ్లు ఇప్పుడు ఎవరికి కానరాని వారిగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లయినా ఉద్యమకారులకు, కళాకారులకు పార్టీపరంగా, ప్రభుత్వ పరంగా తగిన గౌరవం, ఆదరణ లేక కుమిలిపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి నాయకులు కేవీ రంగారెడ్డి, పల్లె వినయ్ కొత్త రవికుమార్ గుప్త, వికాస సమితి నాయకులు శ్రీనివాసా చారి, వేణు గోపాల్, బీఆర్ఎస్ మాజీ కార్యదర్శి ముక్కా సాంబశివరాజు, బీఆర్ఎస్ నాయకులు మెట్టు సూర్యప్రకాష్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యండీ ఖలీల్,టీఫ్‌టీయూ జీహెచ్ఎంసీ అధ్యక్షులు వి.శ్రవణ్ కుమార్, తెలంగాణ ఫోటోగ్రాఫర్స్ సంఘ నాయకులు వెంకట్ రెడ్డి, కిషన్ గుప్త, జగదీష్ గౌడ్, తెలంగాణ నాయిబ్రహ్మణ సంఘం నాయకులు బాలక్రిష్ణ, మల్లేష్, చందు, టీఎఫ్‌టీయూ నాయకులు ఇ.శ్రీధర్, రాములు, నరేష్, తెలంగాణ గ్యాస్ వర్కర్స్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రమేష్, శ్రీనివాస్, తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు మహిపాల్, చందు, సురేష్, తెలంగాణ రజక సంఘం నాయకులు జానయ్య రజక, నిరంజన్, వెంకట్, క్రిష్ణ, పెయింటర్స్ అసోషియేషన్ నాయకులు క్రిష్ణ, బత్తుల శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోషియేషన్ నాయకులు యాదగిరి, గోవర్ధన్, నాయకులు కొడుమూరి దయాకర్, ముకుందరెడ్డి, బి.రాములు, దళిత సంఘం నాయకులు పరుషరాం, భరత్ మాదిగ, రుద్రాల స్వామి, కాచం ఫౌండేషన్ నాయకులు దాము మహేందర్ యాదవ్, గంట సుదర్శన్, కూర రమేష్, రాంకోటి, ఆర్‌టీసీ అవుట్‌సోర్సింగ్ నాయకులు నాగరాజు ముదిరాజ్, వెంకి, కొమ్ము ప్రవీణ్, మట్ట రాజు, యాదవ్, శ్రీను రజక, సలీం, మహిళా నాయకురాళ్ళు సువర్ణ చలమారెడ్డి, కాచం సుష్మ, వేద భవాని, ఉపేంద్ర, రేణుక, రాణి రెడ్డి, మాజీ జడ్పీటీసీ పూలమ్మ, స్వీపర్ల సంఘం నాయకులు గట్టెన్న, చెన్‌రాయుడు, నర్సింహ్మ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆమనగల్లులో పూరీ జగన్నాథ్ రథయాత్ర



**విశ్వంభర, అమనగల్లు :** పట్టణంలో శుక్రవారం పూరీ జగన్నాథ్ రదయాత్ర ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని కూకట్పల్లి ఇస్కాన్ దేవాలయం వారి సహకారంతో నిర్వహించిన రథయాత్రకు భక్తులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఇస్కాన్ టెంపుల్ రథం ఆమనగల్లు చేరిన సందర్భంలో ఘన స్వాగతం తెలిపారు. మార్కండేయ దేవాలయం వద్ద మహిళలు మంగళ హారతులతో రథానికి స్వాగతం పలికి పూజలు చేశారు. ఇస్కాన్ దేవాలయం నుంచి వచ్చిన పలువురు విదేశీ భక్తులు భక్తిశ్రద్ధలతో చేసిన నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలోని అమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కల్వకుర్తి మండలాల నుంచి జగన్నాథ్ రథయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక అయ్యప్పకొండ నుంచి రథయాత్ర ప్రారంభమై బస్టాండ్ మీదుగా కొనసాగి కన్యకాపరమేశ్వరి, మార్కండేయ స్వామి దేవాల యాలలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రథయాత్ర వ్యవస్థా ప్రముఖ్ పాపిశెట్టి రాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభయాత్ర ప్రముఖ్ ఎంగళి బాలకృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, పత్యా నాయక్, సీఐ ప్రమోద్, ఎస్ఐ వెంకటేష్, రామ్మోహన్, శ్రీనివాసులు, గ్రామ పెద్దలు గుర్రం భద్రయ్య, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.






# తెలంగాణ బతుకుచిత్రం మారాలి!

'బతుకుచిత్రం'మారాలి!
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలి!
ప్రత్యేక రాష్ట్రాన ప్రజల కలలు పండాలి!!

అన్న అందెశ్రీ రాసిన గీతం.. రాష్ట్రగీతంగా ప్రకటింప చేయడం నాలుక్కోట్ల గొంతుల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. తెలంగాణ ఆవిర్భావం కోసం తొలి మలిదశ ఉద్యమాలలో అశువులు బాసిన అమరవీరులని స్ఫురింప చేస్తున్నది. తెలంగాణ సాధన పది శాతం విజయమేనని, సాధించుకున్న తెలంగాణలో ప్రజల కలలు నెరవేరాలి అది ప్రజాస్వామిక ప్రత్యేక రాష్ట్రంగా విలసిల్లాలని కల కన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ మాటలను గుర్తు చేస్తున్నది. తెలంగాణ అమరుల స్తూపం అడుగున కాలిపోయిన నేలకొరిగిన వీరుల గుండె రంధ్రాలగుండా ఎగజిమ్ముతున్న తెలంగాణ పోరు వారసత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా మార్చవలసింది చిహ్నాలనే కాదు.. తెలంగాణ బతుకు చిత్రాన్నని.. ప్రాంతేతరుడే దోపిడి చేస్తే ప్రాంతం దాకా తన్ని తరుముతం! ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాంతంలోనే పాతర వేస్తాం!! అన్న కాళోజీ మాటలు ఈ పదేళ్ల తెలంగాణ, దశను దిశను కళ్ళకు కడుతున్నది.

మంచి ప్రభుత్వంలో ఆకలితో అలమటించేవారు, అక్షరానికి దూరమయ్యేవాళ్ళు, అన్యాయానికి అక్రమాలకు గురయ్యే వాళ్ళు ఉండరు!

అన్న తెలంగాణ వైతాళికుడు వట్టి కోట ఆల్వార్ స్వామి మాటలు పదేళ్ళ తెలంగాణలో ప్రజల కలలు నెరవేరాయా! నెరవేరుస్తారా? అనే చర్చను ముందుకు తెస్తుంది. అధికారిక గీతంగా చెవుల్లో రింగుమంటు న్న జయజయహే తెలంగాణ గీతం .. ఓపెన్ కాస్ట్ ల్లో నుంచి తవ్వుకు పోతున్న నల్ల బంగారాన్ని, సింగరేణిలో మాడిపో యిన, ఊడిపోయిన కొలువుల కోసం నిరీక్షిస్తున్న తెలంగాణ బిడ్డల దయిన్యాన్ని, సహజమైన వన సంపద, సిరులు పండే యెద తెలంగాణ ఎండిపోతూనే ఉన్నది. పూడిక తీసిన చెరువులు నాలాలన్నీ ఇప్పుడు నాయకులకు రియల్ ఎస్టేట్ విల్లాలుగా విలసిల్లుతున్నవి. అంతర్జాల అంతర్ వలయాల చక్రబంధంలో హైదరాబాద్ నగరం ఇప్పుడు 'ఫ్రీ 'జోన్ గానే వర్ధిల్లుతున్నా...

కృష్ణ గోదావరి నది జలాల వాటాల పంపకం సాగర్ జలాశయం లా ఇంకిపోయింది. ఇప్పుడు ఇంట్లోకైనా ఒంట్లోకైనా నీళ్లు ట్యాంకర్ల బాటిళ్లలో కొనుక్కుతాగాల్సిందే. కరెంటు వచ్చినా నీళ్ళు ఇచ్చినా.. పండిన పంటకు తడిసినా, ఆరినా రేటు నిర్ణయించేది మిల్లర్లే. రైతుబంధులైనా, బ్యాంకు లోన్లైనా ఎన్నికల బాండ్లలా మారిపోయాయి.

ప్రభుత్వ ఆస్తులన్నీ అమ్మేసినా అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. లక్షల కోట్లలో బడ్జెట్ ప్రకటించబడుతున్నా, బడిలో స్వీపర్లను నియమించలేని దుస్థితి కొనసాగుతున్నది. కీరవాణి సంగీతం పట్లవలసాధిపత్యాన్ని దిక్కరిస్తున్న స్వరాలు,

కార్పొరేట్ హాస్పిటల్స్, కాలేజీలు చేస్తున్న దోపిడిని నిలువరించలేకపోతున్నవి. కాకతీయ తోరణాన్ని తొలగించాలని పాలకులు, ఓరుగల్లులో సభ పెట్టుకున్న సమూహ రచయితలపై దాడిని కానీ, నిరుద్యోగుల ఆందోళనలపై దాడులను నివారించలేకపోతున్నారు. నిత్యం బాల్యాన్ని అమ్ముకుంటున్న బాలకార్మికుల బాగుల కోసం కృషిచేయాల్సింది పోయి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీల దైన్యం మీద స్కిట్ లో పాల్గొన్న చిన్నారులను అరెస్టు చేయడం. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొట్లాడే కార్మిక నాయకులపై కేసులు పెట్టడం తెలంగాణాలో కొనసాగుతున్నది. చార్మినార్ గుర్తును తొలగించదలిచిన వాళ్లు.. పాత బస్తీ ఇరుకు బతుకుల చిత్రాన్ని మార్చవలసిఉందని, గంగా జమున తెహజీబ్ సంస్కృతిని పరిరక్షించవలసి ఉన్న ది. అన్నిటికన్నా ఈ పదేళ్ల కాలంలో తెలంగాణ దశను, సాగుతున్న దిశను పరిశీలించవలసిఉన్నది. అధికార ప్రతిపక్ష వాదోపవాదాల రాజకీయ చిత్రాల మార్పుగా కాకుండా, సుఖశాంతుల తెలంగాణ కోసం.. ప్రజల కలలని సాకారం చేసే దిశలో పాలకులు కృషి చేయవలసిన సందర్భం.



అందుకు నీళ్లు, నిధులు, నియామకాలు ప్రజా సంక్షేమం కోసం, తెలంగాణ అభ్యున్నతి కోసం పదేళ్ల గత అనుభవం నుంచి పరుగులు పెట్టించవలసిన సందర్భం. గత పది ఏళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, దారితప్పిన తీరుతెన్నులను ఇప్పుడు అధికారం పొందిన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చవలసిన సందర్భం. ఇవాళ కనీసం తెలంగాణాలో ప్రజలు విద్యా వైద్యం కోసం ఖర్చు పెడుతున్న లక్షలాది రూపాయల ఆదాయాన్ని చేజార్చుకోకుండా ఈ ప్రభుత్వం ప్రయత్నించ వలసిఉంది.

గత ప్రభుత్వం రెసిడెన్షియల్ కళాశాలలు, గురు'కులాల'ను ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో గ్రామీణ ప్రాంతాల్లో నడిచే ఇరవై వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసింది. మన ఊరు మనబడి పేరుమీద తీసుకున్న పథకం ప్రారంభంలోనే ఆగిపోయింది. వేలాది పాఠశాలలు ఊర్లలోకి వస్తున్న ప్రైవేటు బస్సుల్లో వెళ్ళిపోతున్న పిల్లల వల్ల ప్రభుత్వ బడులు మూత పడిపోయాయి. పర్యవసానంగా టీచర్లే అవసరం లేని స్థితి కొనసాగుతుంది. ముఖ్యమంత్రి గారు నూతనంగా ప్రతి ఊరిలో పాఠశాల తెరవాల్సిందే నన్న నిర్ణయం స్వాగతించవలసిన అంశం. అదే కోవలో ఆయా పాఠశాలలు ఆగిపోయిన మన ఊరు మనబడి లో భాగంగా ఏర్పాటు చేయవలసిన మౌలిక వసతుల పెంపుదల కోసం కృషి చేయవలసి ఉన్నది. మంచినీరు, మరుగుదొడ్లు, మంచి యూనిఫాం, మెరుగైన మధ్యాహ్న భోజనం, తరగతి కో టీచర్, ప్రైవేట్ స్కూల్స్ నియంత్రణ నూ కొనసాగించవలసి ఉన్నది. అంగన్వాడీలను ప్రభుత్వ పాఠశాలలో మిలితం చేస్తూ.. ఆయాలను స్వీపర్లను రెగ్యులర్గా నియమించవలసి ఉన్నది. అన్నిటికంటే ముఖ్యమైనది విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దవలసిన అంశం మాతృభాషలో విద్యా విధానం కొనసాగించడం. ఆంగ్ల మాధ్యమంలో చదివి తేనే కొలువులు వస్తాయని డాలర్ కలలను వదిలి, గత ప్రభుత్వ ఏకపక్షంగా తీసుకున్న అన్ని పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం లోకి మార్చి పుస్తకాలను తెలుగులో ఇంగ్లీషులో ప్రచురించడం వల్ల, అటు ఆంగ్లము ఇటు తెలుగు రాని ఒక తరం తయారవుతున్నది. అట్లాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంని (5+3+3+4.) నిరాకరిస్తూ తెలంగాణ భౌతిక సామాజిక సాంఘిక స్థితిగతులకు అనుగుణంగా రాష్ట్ర విద్యా విధానాన్ని అమలు చేసుకోవలసి ఉన్నది. పదవ తరగతి వరకు కొనసాగుతున్న గ్రేడింగ్ విధానాన్ని సమీక్షించుకుంటూ ఇంటర్ విద్య తీరు తెన్నులను మార్చుకోవాల్సి ఉన్నది. అన్ని యూనివర్సిటీ డిగ్రీ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయవలసి ఉన్నది. నూతన ప్రభుత్వం టీచర్ల ప్రమోషన్లు బదిలీలతో పాఠశాలల్లో అన్ని పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం అభినందించాల్సిన అంశం . దానితో పాటుగా ప్రభుత్వ విద్య మెరుగు కోసం పర్యవేక్షణ అధికారుల నియామకాలతో పాఠశాల విద్యను పరిపుష్టం చేయవలసి ఉన్నది.

వైద్య రంగంలో గత పదిహేళ్లుగా సాధించిన కళాశాలల ఏర్పాటు ఒక ముందడుగు అయినప్పటికీ, ఇవాళ ఆ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రమాణాలపై దృష్టి సారించడమే కాకుండా, గ్రామీణ ప్రాంత హాస్పిటల్స్ లో జిల్లా కేంద్రాల్లో నియామకాలు చేపట్టి నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం అన్ని వనరులు వస్తువులను ప్రభుత్వ దవాఖానాల్లో పెంపొందించవలసి ఉన్నది. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్ర స్థాయిలోనే గతం లో లాగా ఎంట్రెన్స్ నిర్వహించాలి.ఇవాళ కడుపు నొప్పి లేసిన కాళ్ళు నొప్పి లేసిన లక్షల రూపాయలు పిండుకుంటున్నటువంటి కార్పొరేట్ హాస్పిటల్స్ పై నిగా పెంచి నియంత్రణ కొనసాగించవలసి ఉన్నది. ఉద్యోగులకు ఇతరులకు ఇచ్చే రీయంబర్స్మెంట్ బదులుగా ప్రభుత్వ హాస్పిటల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ గా జిల్లాకొకటి సేవలందించే ప్రయత్నం చేయవలసింది. గ్రూప్ ఒన్ ఇనర్వ్యూలో నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చేస్తున్నట్లు పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా 1:100 తో సరియైన అభ్యర్థుల్ని ఎంపిక చేయడంతో పాటు, టీచర్ల నియామకం కాస్త ఆలస్యం చేసైనా గ్రామీణ ప్రాంత పాఠశాలను బలోపేతం చేయడానికి ప్రైవేటు బస్సుల్లో ఊళ్ళో పిల్లలు ప్రైవేట్ స్కూల్లోకి వెళ్లకుండా నియంత్రించాలి. విద్య వైద్య వ్యవసాయ సేవా,రంగంలో ప్రజలు తమ వ్యయాన్ని తగ్గించుకోగలిగితే ప్రభుత్వాలు ఉచితాల మీద ఆధారపడవలసిన స్థితి రాదు. అట్లాగే తెలంగాణలో ఉన్నటువంటి వివిధ వనరుల మీద అవసరమైన రంగంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఊరూరా చెరువు చేను పుట్టగుట్ట కాపాడుకొని బతుకుదెరువుకు బాసటగా నిలిచే తెలంగాణ పల్లెల్ని మళ్లీ సృష్టించుకోవాలి. మద్యంతో తూగుతున్న తెలంగాణ పల్లె సుఖశాంతులతో విలసిల్లే నవతెలంగాణ గా మార్చుకునే సంకల్పం కావలిప్పుడు. పర్యావరణం, భూగర్భ నిధులు నదుల విధ్వంసం లేకుండా జలవనరుల అడవుల సంరక్షణతో తెలంగాణ పచ్చని ప్రజాస్వామిక సామాజిక తెలంగాణగా మారాలి.

- ప్రభాకర్ కస్తూరి.
తెలంగాణా టీచర్స్ ఫోరం కన్వీనర్.

## ప్రభుత్వం వినియోగించే వాహనాలన్నింటికీ
# జీపీఎస్ ఏర్పాటు చేయాలి

"ప్రభుత్వం అమలు చేయు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ఎంపిక, పర్యవేక్షణ చేయుటకు గల ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన రిపోర్టులను ప్రభుత్వానికి అందజేయుటకు గాను వాహనం సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ అధికారులకు కల్పించిన వాహన సౌకర్యము కోరకు ప్రభుత్వమే వాహనములను కోనుగోలు చేసి వినియోగించడం, మరి కొన్ని ప్రయివేటు వాహనములను అద్దెకు తీసుకుని వాడుకోవడం జరుగుతుంది.



ప్రభుత్వ, ప్రైవేటు వాహనములను వాడుతున్న పర్యవేక్షణాధికారులు వాహనములను తమ స్వంత పనులకు వినియోగించుకోవడం, సాధారణంగా (పరిపాటిగా) మారింది. వాహనములను అధికారి నివాసం ఉండే ప్రదేశం నుంచి అనగా స్థానికంగా ఉన్న నివాసం నుంచి కార్యాలయం వరకు, కార్యాలయం పరిధిలోగల ప్రాంతాలను సందర్శించడం, తనిఖీలు చేయడం, ప్రజలను చైతన్యపరచే, సంక్షేమ పథకాల గురించి తెలియజేయు కార్యక్రమాల్లో పాల్గొనడం, అభివృద్ధి పనులను పర్యవేక్షించడం వంటి పనులకు మాత్రమే వాహనములను వినియోగించాలి. కాని దానికి విరుద్ధంగా అధికారి తను పనిచేసే కార్యాలయమునకు నిర్దేశించిన పరిధిలో నివాసం ఉండకుండా పట్టణాలల్లో నివాసం ఉంటున్నారు. అదే క్రమంలో స్థానికంగా నివాసం ఉంటున్నట్లుగా ఇంటి అద్దె అలవెన్స్ (HRA) నెలవారీగా పొందుతున్నారు. స్థానికంగా నివాసం ఉండకపోవడం వల్ల సమయానికి విధులకు హాజరుకాలేక పోవడం, కొన్ని సార్లు విధులకు గైర్హాజరు కావడం జరుగుతుంది. అదే క్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు వాహనములను పరిమితికి మించిన దూరం వరకు తిరుగుతున్నారు. అధికారి పట్టణంలో నివాసం ఉండే గృహం వరకు ప్రభుత్వం కేటాయించిన వాహనములను వాడుతున్నారు. విధులకు గైర్హాజరు అయి తమ స్వంత పనులకు, విందులకు, వినోదాలకు, సభలకు, వివిధ సమావేశాలకు తిరుగుతూ ఒకవైపు ప్రజాధనంను వృధా, దుర్వినియోగం చేస్తున్నారు. తమకు నిర్దేశించిన పరిధిలో పర్యటనలు, పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు అట్టి ప్రదేశాలను సందర్శించకుండానే తప్పుడు రిపోర్టులు, లాగ్ బుక్ లలో తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారు. తిరిగిన ప్రాంతాల మధ్య ఉన్న దూరంను మించి అధికంగా కిలోమీటర్లు తిరిగినట్లుగా చూపుతూ డీజిల్ ఖర్చుపేరుతో డబ్బులను “స్వాహా చేస్తున్నారు".

అదే క్రమంలో ప్రయివేటు వ్యాపార అనుమతి వున్న ట్రావెల్స్ వాహనములు, టాక్సీప్లేట్ కలిగిన వాహనములను అద్దెకు వినియోగించుకోవాల్సి ఉండగా, వారితో అగ్రిమెంట్లు చేసుకోవాల్సి ఉండగా అధికారులు తమ వ్యక్తిగత వాహనములను వినియోగించుతూ తప్పుడు బిల్లులు పెట్టి ప్రభుత్వం ద్వారా ట్రెజరి ద్వారా డబ్బులు, బిల్లులు అధికారులు స్వాహా చేస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు వేగవంతంగా, వీలైనంత మేరకు ప్రజల వద్దకే వెళ్ళి సేవలు అందించేందుకు కృతనిశ్చయంతో అడుగులు వేస్తున్నది. ప్రజాపాలన విజయవంతంగా సాగాలంటే ప్రతి ప్రభుత్వ అధికారి, పర్యవేక్షణాధికారులు వారి విధుల్లో సత్ఫలితాలు రావాలంటే, పారదర్శకత పెరగాలంటే, ప్రజాధనం వృధాను, దుర్వినియోగాన్ని అరికట్టాలంటే ప్రభుత్వ, ప్రయివేటు వాహనములకు GPS (జిపియస్) పరికరాలు బిగించడం ద్వారా వందశాతం సత్ఫాలితాలు వస్తాయి. ప్రజాధనం ఆదా అగును. వాస్తవ రిపోర్టులు ప్రభుత్వానికి అందును. కొందరు ప్రభుత్వ అధికారులు వ్యక్తిగత వాహనములు వాడుకుంటూ, ట్రావెల్స్ వారి టాక్స్ కలిగిన వాహనములను వాడుకున్నట్లుగా తప్పుడు, దొంగ అగ్రిమెంట్లు, బిల్లులు పెట్టి బిల్లులు డ్రా చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో ఈ విధమైన తప్పుడు బిల్లులు డ్రా చేస్తున్న విషయాలు కలవు. పర్యవేక్షణాధికారులు స్వంత వాహనములలో తిరుగుతూ అట్టి వాహనములపై "ప్రభుత్వ వాహనము" అని స్టిక్కర్లు వేసుకుని బహిరంగంగా తిరుగుతున్న సంబంధిత మోటార్ వెహికల్ యాక్ట్ అమలు చేయు రవణా శాఖ అధికారులు (RTO) అధికారులు పట్టించుకోవడం లేదు.

పై సమస్యలన్నింటి పరిష్కరానికీ, ప్రజాధనం వృధాను అరికట్టుటకు, పర్యవేక్షణాధికారులు స్థానికంగా ఉండి విధులు సక్రమంగా నిర్వర్తించుటకు, పర్యవేక్షణలు పెరిగి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో నాణ్యత పెరగడానికి ప్రభుత్వ వాహనములకు, అద్దెకు తీసుకున్న వాహనములకు GPS ఏర్పాటు చేయడం ద్వారా సత్ఫలితాలు పొందడం వందశాతం ఖాయం. GPS ఏర్పాటును వ్యతిరేకించేవారు విధులను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యే వారుగా మిగిలిపోతారు. ప్రజాధనం స్వాహా చేస్తున్న విషయం నిజమని స్వాహాచేసే అవకాశం కోల్పోతున్న మనే దాని కారణంలతోనే వ్యతిరేకించే అవకాశాలు ఉన్నా ప్రజాపాలన జరిగి ప్రజలందరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ది, అభివృద్ధి పనుల్లో నాణ్యత పెరగాలన్నా, ప్రజాధనం వృధాను అరికట్టలన్నా, ప్రభుత్వ వాహనములకు, ప్రభుత్వం అద్దెకు తీసుకున్న వాహములకు తప్పనిసరిగా GPS పరికరాలు భిగించాల్సిందే (వాహనముల ట్రాకింగ్ చూసుకునే సౌకర్యం), పారదర్శకతకు, జవాబుదారితనమునకు పెద్దపీట వేయాల్సిందే, ప్రజాధనం దుర్వినియోగాన్ని, వృధాను అరికట్టాల్సిందే. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.



-డా|| యర్రమాద కృష్ణారెడ్డి
వ్యవస్థాపకులు-సమాచార హక్కు వికాస సమితి,
సెల్: 99496 49766



# తెలంగాణకు జలుబు, జ్వరం

**విశ్వంభర, హైదరాబాద్:** వర్షాకాలం మొదలైంది అంటే సీజనల్ వ్యాధులకి వెల్కమ్ చెప్తూ ఉంటాయి.. ప్రతి ఇంట్లో జ్వరము, దగ్గు, జలుబు వంటి వైరల్ జ్వరాలతో జనాలను పట్టి పీడిస్తుంటాయి. ఇప్పటికే వ్యాధుల భారిన పడిన వారు ఆసుపత్రుల్లో క్యూ కడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం, గొంతు నొప్పి, వాంతులతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఏ హస్పిటల్లో తొంగి చూసిన రోగుల క్యూ లైన్ కనిపిస్తుంది.

**దండెత్తిన డెంగీ**

రాష్ట్రంలో చాలా ఆస్పత్రిలో వైరల్ ఫీవర్స్ తో వచ్చే రోగులే కనబడుతున్నారు. ఇక హైదరబాద్లో కూడా వీటి ప్రభావం అధికంగానే ఉంది. పది రోజులుగా ఈ కేసులు మరింత పెరుగుతున్నాయి. హైదరాబాద్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో డెంగీ కేసులు ఎక్కువవుతున్నాయి. అయితే గతంతో పోలిస్తే డెంగ్యూ కేసులు కాస్త తక్కువ ఉన్నాయని వైద్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2023 జూన్ మాసంలో 284 కేసులు నమోదు కాగా... 2024 జూన్ లో 263 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. హైద్రాబాదు నగర శివారులో చేవెళ్ల మండలం చన్వెల్లిలో డెంగ్యూ సోకి ఒక బాలుడు మృతి చెందగా.. మరో బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏజెన్సీ ఏరియాల్లో తీవ్రత ఇంకా ఎక్కువగా ఉంది. ఆస్పత్రుల్లో క్యూ లైన్లు చూస్తే.. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక డెంగీ రోగిని కుట్టిన దోమ ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతడికి డెంగీ వచ్చే ప్రమాదముంది. ఈ దోమకు మనిషి రక్తమే ఆహారం.

**ప్రైవేట్ ఆస్పత్రుల దందా**

డెంగీ దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది. డెంగీ వచ్చిన రోగిలో ఒక్కసారిగా బీపీ తగ్గిపోతుంది. విష జ్వరం తీవ్రంగా మారి ప్లేట్ లెట్స్ తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇక బయటకు వెళ్లేటప్పుడు ఫుల్ సైజ్ దుస్తులు వేసుకోవాలి. అయితే ప్రైవేట్ ఆస్పత్రులలో ప్లేట్లెట్లు తగ్గాయని లక్షలకు లక్షలు వసూలు చేస్తూ ప్లేట్ లెట్స్ ఎక్కించే ప్రయత్నం చేస్తారు. కాబట్టి తప్పనిసరిగా 20 వేలకు తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ప్లేట్లెట్స్ ఎక్కించుకునే అవసరం ఉంటుంది. లేకపోతే డెంగీ జ్వరం తగ్గిన తర్వాత ప్లేట్ లెట్స్ సంఖ్య పెరిగే స్వభావం ఉంటుంది.

**ప్రజలు జాగ్రత్తలు పాటించాలి**

వర్షా కాలంలో ఇంటి చుట్టూ పరిశుభ్రమైన వాతావరణాన్ని మెయింటైన్ చేయాలి లేకపోతే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. చిన్న చిన్న విషయాలలో కూడా జాగ్రత్తలు పాటించకపోతే దోమల బెడద పెరిగి వ్యాధుల బారిన పడతారు. అందుకే ఇంటిపై ఉండే ట్యాంకులకు మూతలు పెట్టాలి. ఫ్లవర్ వాజ్, కూలర్ నీళ్ళను నిత్యం మార్చాలి. కాలనీ, ఇళ్లలో నిల్వ ఉండే గుంతులను పూడ్చాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మరోవైపు ఎటువంటి వ్యాధులకైన ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు చేసి ట్రీట్మెంట్ అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులను అప్రమత్తం చేసి సీజనల్ వ్యాధులని అరికట్టేందుకు సన్నద్ధం అయిందని చెబుతున్నారు.

# గోలీలు కూడా ఇస్తలేరు

- సర్కారు దవాఖానల్లో దారుణంగా పరిస్థితి
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్ల పాలనలో సర్కార్ వైద్యానికి జవసత్వాలు ఇచ్చింది కేసీఆర్ సర్కార్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే దశాబ్దాల దుస్థితి నుంచి చలో పోదాం పదరో సర్కార్ దవాఖానకు అనే ధీమాను తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆయన స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే సర్కార్ దవాఖానాల్లో కనీసం మందు గోలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇంత దారుణమైన దుస్థితికి దిగజార్చింది రేవంత్ సర్కార్ అని మండిపడ్డారు. పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో.. ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలయినయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

**ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ రమేష్**




**విశ్వంభర, కరీంనగర్ :** సమాజ సంక్షేమం కోసం ఆలోచించే ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంలో పాల్గొనాలని ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ తీట్ల రమేష్ బాబు పిలుపునిచ్చారు. బసంత్ నగర్ వాస్తవ్యులు, మధ్యప్రదేశ్‌లో కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పరికిపండ్ల నరహరి మార్గదర్శకంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యులు తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్, కొత్తపల్లిలో పర్యటన చేశారు. మహాత్మానగర్‌లోని మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులను కలిసి వారితో మాట్లాడారు. పాఠశాలకు అవసరమయ్యే వాటి విషయంలో తమవంతుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కొత్తపెల్లిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. వాతావరణం కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు మిట్టపెల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, అరవింద్ యాదవ్, గడ్డం అరుణ్, కొలుగూరి వెంకటేష్, మహేష్ పటేల్, సూద్దాల సతీష్, గడ్డం లక్ష్మణ్, శ్రవణ్, అజయ్, రమేష్, అన్వేష్, నిఖిల్ పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతుల ఇండ్లకు

# నోటీసులు అంటించడం హేయం

**భూ నిర్వాసితులకు ఎకరానికి 30 లక్షలు నష్టపరిహారం అందించాలి**



**విశ్వంభర, చింతపల్లి :** ఆర్ విద్యాసాగర్ రావు డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండల కేంద్రంలో నిర్మించే జలాశయానికి చింతపల్లి, మల్లారెడ్డిపల్లి, నసర్లపల్లి మూడు గ్రామాలతో కలిపి ప్రాజెక్టు నిర్మించడానికి అప్పటి ప్రభుత్వం 2016 సంవత్సరంలో శ్రీకారం చుట్టింది. 0.94 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు పూర్తి విస్తీర్ణం 1691 ఎకరాలు, ఇందులో చిన్న, పెద్ద చెరువుల విస్తీర్ణం సుమారు 400 ఎకరాలు కాగా కేవలం చింతపల్లి గ్రామానికి చెందిన భూమి 1209 ఎకరాలు 2016-17 సంవత్సరంలో మొదటి, రెండవ విడతలలో 759 ఎకరాల భూమిని సేకరించారు. అయితే మొదటి విడతలో ఎకరానికి 4.15 లక్షలు ఇవ్వగా, రెండవ విడతలలో ఎకరానికి 5.15 లక్షలు చెక్కుల ద్వారా రైతులకు డబ్బులు చెల్లించారు. ప్రభుత్వ అధికారులు 759 ఎకరాలు సేకరించగా.. 562 ఎకరాల భూములకు మాత్రమే డబ్బులు చెల్లించారు. ఇంకా 197 ఎకరాల భూములకు రైతులతో అధికారులు సంతకాలు చేయించుకోని చెక్కులు మాత్రం ఇవ్వలేదు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది దీంతో జిల్లా ఉన్నతాధికారులు మూడో విడతలో భాగంగా చింతపల్లి గ్రామానికి సంబంధించిన 428 ఎకరాల భూమి సేకరణకు స్పెషల్ కలెక్టర్ భూ సేకరణ కార్యాలయం ఏఆర్ఎంపీ నల్లగొండ నుండి వచ్చిన అధికారులు చింతపల్లి గ్రామంలో తిరుగుతూ రైతులకు నోటీసులు పంపిణీ చేస్తున్నారు. కొంత మంది రైతులు నోటీసులు తీసుకోకపోవడంతో రైతుల ఇంటికి నోటీసులు అతికించి వెళ్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సంతకాలు చేయని 428 ఎకరాల భూమికి ఇప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి 11.50 లక్షలు ఇస్తామని అధికారులు తెలుపడంతో 2016-17 సంవత్సరంలో సంతకాలు పెట్టి చెక్కులు రాని 197 ఎకరాల రైతులకు ఎకరాకు 5.15 లక్షలు ఇస్తామని అధికారులు అనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చింతపల్లిలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే రైతులకు ఇప్పుడున్న భూమి విలువ ప్రకారం ఎకరానికి 30 లక్షల రూపాయలు, ఇంటి స్థలం, ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కలిపించాలని రైతులు జిల్లా ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ నెల 30వ తారీకు కలెక్టర్ సమక్షంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ భూ సేకరణ కార్యాలయం ఏఆర్ఎంపీ నల్లగొండ అధికారులు సీనియర్ అసిస్టెంట్ నుస్రత్ అలీ, జూనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, లష్కరే వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి భారీగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..?

- త్వరలోనే ఆరుగురి చేరిక
- ఇంకా కొనసాగనున్న ఫిరాయింపుల పర్వం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో బీఆర్ఎస్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇవాళ కాంగ్రెస్‌లోకి రాజేందర్‌నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేరనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తిరుమల దర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఈరోజు తిరుపతి నుంచి నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లనున్నట్లు సమాచారం. సాయంత్రం 7 గంటలకు మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు జంపింగ్ లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలా మంది హస్తం గూటికి చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఆరు మంది ఎమ్మెల్యేలు చేరిపోయారు. దీనిపై బీఆర్ఎస్ గట్టిగానే పోరాటం చేస్తోంది. స్పీకర్ కు లేఖలు రాస్తూ, న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తోంది. అయినప్పటికీ ఫిరాయింపుల పర్వం ఆగడం లేదు. ఇదిలా ఉంటే కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయంటూ గాంధీభవన్ నుంచి లీకులు ఇస్తున్నారు ఆ పార్టీ నేతలు. ఈ నేపథ్యంలో రాజకీయంగా పెద్ద చర్చే జరుగుతోంది. కాంగ్రెస్ లో చేరే వారి జాబితాలో ముందుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో పాటూ మరో ఐదు మంది ఉన్నారు. కుత్బుల్లా పూర్ నుంచి కెపి. వివేకానంద, ఎల్బీనగర్ నుంచి సుధీర్ రెడ్డి, శేరిలింగంపల్లి నుంచి కమ్మ సామాజికవర్గానికి చెందిన కీలక నేత అరికె పూడి గాంధీ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో ఈయన పార్టీ అధికారిక కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. వీరితో పాటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణా రావు హస్తం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గతంలో ఆరు మంది ఎమ్మెల్సీలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ కు గడ్డుపరిస్థితులు తప్పడం లేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారిలో కొందరు గత లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే ఉన్నారు దానం నాగేందర్. ఇక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి లాంటి కీలక నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోవడంతో బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలినట్లయింది. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా బీఆర్ఎస్ ను వీడారు. దీంతో సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో బీఆర్ఎస్ క్యాడర్ క్రమంగా బలహీనపడుతున్నట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే మొన్న జరిగిన వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిన వారందరూ తిరిగి ఈ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. దీంతో మరికొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఊతం ఇచ్చినట్లయింది. ఈ వ్యాఖ్యలు చేసి వారం కూడా కాకుండానే ఆరు మంది ఎమ్మెల్యేలు కారు దిగి కాంగ్రెస్ లోచేరుతున్నారంటే ఇది రాజకీయంగా పెను సంచలనమనే చెప్పాలి. ఈ పరిస్థితి ఇంతటితో ఆగుతుందా లేక మరికొన్ని రోజులు కొనసాగుతుందా తెలియాలంటే వేచిచూడాలి. అలాగే దీనిని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందన్నది కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

## గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై

# రైతులతో కలెక్టర్ సమావేశం



**విశ్వంభర, భూపాలపల్లి :** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందొద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 3 మండలాల పరిధిలోని 13 గ్రామాల్లోని రైతులు భూములను కోల్పోతున్నారని, భూసేకరణ విషయంలో రైతుల యొక్క సలహాలు, సూచనలు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ ల కోసం భూ సేకరణ చేయడం జరుగుతుందని భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభీష్టం మేరకు భూసేకరణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 35 కిలో మీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని, రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామన్నారు. గతంలో భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్ట్ ల కోసం భూసేకరణ చేయడం జరిగిందనీ ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగలేదని గుర్తు చేశారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే ఈ ఈ మనోహర్, మూడు మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన



**విశ్వంభర, ఆత్మకూరు (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ మరియు డ్రై డే సందర్భంగా పారిశుధ్యం, పరిశుభ్రత మీద స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొరటికల్‌లో తాజా మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాలు అన్ని పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక అధికారులను నియమించి గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సహకారంతో ప్రతీ రోజు వాడ వాడలను శుభ్రం చేస్తూ చెత్త చెదారం లేకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారని అన్నారు. మురికి కాల్వలలో ప్లాస్టిక్ కవర్లు వెయ్యొద్దు అని ప్రజలను కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు అనిపించిన వెంటనే స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టెకోలా సత్తయ్య గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, కందడి అనంత రెడ్డి, జోగు దేవయ్య, ఆశా కార్యకర్తలు హేమలత, నవ్య, శశిరేఖ, అంగన్వాడీ టీచర్ అక్తర్ బేగం, కిష్టయ్య, ఇస్తారి, నరేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఓయూలో పోలీసుల తీరు దారుణం

**టీజేయూ మండలాధ్యక్షుడు గడ్డం నాగరాజు**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ వాయిదా వెయ్యాలని నిరుద్యోగ యువకులు ఆందోళన చేస్తుంటే దానిని న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన జీ తెలుగు న్యూస్ జర్నలిస్టు శ్రీచరన్‌తో పోలీసులు వ్యవహరించే తీరును దారుణమని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు అన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను తాము జర్నలిస్టులమని చెబుతున్న పోలీసులు దురుసుగా వ్యవహరించి, వారిని బలవంతంగా లాక్కొని పోలీస్ వాహనంలో ఎక్కించి పోలీసు స్టేషన్లో నిర్బంధించడం మీడియా భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులపై ఇలాంటి దౌర్జన్యాలు జరగకుండా అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేయూ మండల గౌరవ అధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి, టిజేయు మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్, టీజేయు మండల ఉపాధ్యక్షుడు ఎస్కే అజీజ్, టీజేయు మండల కార్యదర్శి మేడి శ్రీనివాస్,టీజేయు మండల సహాయ కార్యదర్శి బాలగంగాధర్,టీజేయు కోశాధికారి కట్టెకోల రమేష్,టిజేయు మహిళా కార్యవర్గ సభ్యురాలు దంతూరి సుమలత, గుర్రం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ కి చెందిన నాగరిగారి ప్రీతం నియమితులైన సందర్భంగా వారిని జిల్లా కాంగ్రెసు నాయకులు కానుకుంట్ల యాదగిరి, మండల కాంగ్రెసు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)



## అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

**నారాయణఖేడ్ డీఎం మల్లేశం**

**విశ్వంభర, పెద్దశంకరంపేట్ :** గురుపౌర్ణిమ పురస్కరించుకొని నారాయణఖేడ్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షణ కోసం ప్రత్యేకంగా ఆర్టిసి బస్సు సర్వీసులు నడపనున్నట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ను సందర్శించిన సందర్భంగా మాట్లాడారు.. ఈనెల 19వ తేదీ నుంచి నారాయణఖేడ్ నుంచి ఆర్టీసీ బస్సు బయలుదేరి కాణిపాకం వేలూరు గోల్డెన్ టెంపుల్.. దర్శనాల అనంతరం అరుణాచలం చేరుకొని తిరుగు ప్రయాణంలో జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం దర్శించడం జరుగుతుందని వివరించారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం నారాయణఖేడ్‌కు చేరుకోవడం జరుగుతుందని బస్సు చార్జీలు రానుపోను రూపాయలు 4500. భోజనాలు దర్శనం అకామిడేషన్ ఎవరికి వారే భరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్వో పాండు, కంట్రోలర్ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలి

**సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షా సమావేశం**

**విశ్వంభర, షాద్‌నగర్ :** రంగారెడ్డి జిల్లా కేశంపేట వర్షాకాల సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి టీ రాజరత్నం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ అధికారిని, మండల అభివృద్ధి శాఖ అధికారులతో కలసి వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం, అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని, పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే 4 నాలుగు నెలల కాలం చాలా కీలకమైనవని, వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో డ్రై డే నిర్వహించి నిల్వ నీటిని తొలగించాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల వైద్యాధికారిని మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులు, చేతి పంపులు, బావులలో క్లోరినేషన్ చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, పిచికారి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డయేరియా, ఫైలేరియా, ఇతర విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా నివారించాలన్నారు. బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, మండల మెడికల్ అధికారి, అంగన్వాడి సూపర్వైజర్లు, ఎంఈఓ, ఏపీఎం సెర్ప్, ఎంపీఓ మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## పీర్లకోట్టం మరమ్మతులకు యెల్లంలా సంజీవరెడ్డి హామీ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కేంద్రంలో పీర్ల కొట్టం పరిశీలనచేసిన కాంగ్రెస్ పార్టీ మండల అడుక్షులు యేల్లంల సంజీవ రెడ్డి. మండల కేంద్రములో ఉన్న పీర్ల కొట్టంకి మరమ్మతుల పనుల కోసం హామీ ఇచ్చారు. అట్టి పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, ఎన్ఎస్యూఐ జిల్లా కార్యదర్శి రేగు రమేష్, మైనార్టీ సెల్ నాయకులు ఎండీ మంజూరు ఖాన్, ఎన్ఎస్యూఐ టౌన్ అధ్యక్షులు ఇప్ప మహేష్, చింటూ, గడ్డం మహేష్ నిర్వాహకులు పర్శిలించారు. భువనగిరి వాసి ఈ నిర్మాణానికి కావలసిన మేజర్ మెంట్‌ను తీసుకున్నాడు. ఈ సందర్భంగా పీర్లకోట్టం పనులు పూర్తి చేయిస్తానని సంజీవరెడ్డి హామీ ఇచ్చారు.



తెలంగాణ రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను మోత్కుర్ మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం కవితలక్ష్మి నరసింహ రెడ్డి, పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, 1వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, తిరుమలేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

# మహిళ బాగుంటే ఆ ఇల్లు బాగుంటుంది

- కలెక్టర్ పమేలా సత్పతి
- మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం సభకు శ్రీకారం



**విశ్వంభర, కరీంనగర్ :** మహిళల సమస్యల పరిష్కారానికే అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభకు శ్రీకారం చుట్టామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, భద్రతతో పాటు సమస్యల పరిష్కారానికి ఇందులో ప్రాధాన్యమిస్తామని తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సభ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబం కోసం ప్రతీ రోజు హెల్తీ ఫుడ్ తీసుకోవాలని సూచించారు. మహిళలు బాగుంటేనే ఆ ఇల్లు బాగుంటుంది ఆ జిల్లా బాగుంటుందని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్నంగా శుక్రవారం సభకు శ్రీకారం చుట్టామని, అంగన్వాడీ కేంద్రాలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తద్వారా సరైన సమయానికి పోషకాహారం లభించడంతోపాటు వైద్యపరంగా సూచనలు, సలహాలు అందుతాయని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య భద్రతతో పాటు వారి సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ వేదికగా నిలుస్తుందని తెలిపారు. చిన్నారులు మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగేలా యోగాతో పాటు సరైన సూచనలు, సలహాలు వైద్య సిబ్బంది అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్కారు అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తున్నదని పేర్కొన్నారు. ప్రైవేటు దీటుగా పనిచేస్తున్నాయని, ప్రజలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీలు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి డబ్బును వృధా చేసుకోవద్దని, ప్రభుత్వాసుపత్రులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకోవద్దని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవని పేర్కొన్నారు. అందరూ తమ ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంపీడీఓ ప్రభు, సీడీపీఓ ఉమారాణి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, మహిళా శక్తి కో ఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సూపర్ వైజర్ అరుణ, టీచర్స్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్ ఆశవర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

**ఇసుక పాలసీకి విధి విధానాలు రూపొందిస్తాం : కలెక్టర్ రాహుల్ శర్మ**


**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అక్రమ ఇసుక రవాణా అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇసుక పాలసీకి విధి విధానాలు రూపకల్పనపై పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణా, టిజిఎండిసి, జాతీయ రహదారులు, భూ గర్భ జలవనరుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో జిల్లా వ్యాప్తంగా వాగుల నుండి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా, గోదావరి పరివాహక ప్రాంతాలలోని ఇసుక రీచ్‌ల వద్ద లారీలు, ఇష్టారీతిన నడుపుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అతివేగం, ఓవర్ లోడ్‌తో, సరైన వే బిల్లులు లేకుండా లారీలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టిజిఎంఐడిసి అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా, అనుమతులు ఉన్న కట్టడాలకు జి.ఓ నంబర్ 03 ప్రకారం పంచాయితీ సకార్యదర్శులు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా రాత్రి వేళల్లో పటిష్ఠ పహారా ఉండాలని అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పోలీస్ కేసులు నమోదు చేయలన్నారు. ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టీజీఎంఐడిసి అధికారుల అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు.

జిల్లాలో పలుచోట్ల అక్రమంగా నిలువ చేసిన ఇసుక రీచ్ లను గుర్తించాలని, అక్రమంగా ఇసుక నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని తహసిల్దార్లను, పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటే శ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, మైనింగ్ అధికారి జయరాజ్, జాతీయ రహదారుల ఈఈ మనోహర్ భూగర్భ జల శాఖ అధికారి, తహసిల్దారులు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.


## కదిలిన అధికార యంత్రాంగం

**ప్రభుత్వ కళాశాల పరిసరాలు పరిశుభ్రం**

**విశ్వంభర ఎఫెక్ట్**



**విశ్వంభర, చింతపల్లి :** పడకేసిన పారిశుధ్యం పట్టించుకోని అధికారులు అని "విశ్వంభర దినపత్రిక" లో గురువారం ఒక శీర్షిక వెలువడడంతో మండల ఉన్నత అధికార యంత్రాంగం పరుగులు తీసింది. చింతపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ ఆలుకా జైహింద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పక్కన వున్న చెత్తా చెదారం, అపారిశుద్ధ్యాన్ని పంచాయతీ సెక్రటరీ నాగరాజు గ్రామపంచాయతీ వర్కర్లతో వ్యర్థాలను గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. చింతపల్లి గ్రేడ్-2 వైద్యాధికారి ఇక్బాల్ పర్యవేక్షణలో ఆ ప్రాంతాన్ని అంతా శానిటేషన్ చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చింతపల్లి మండల ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవి మండలంలోని 34 గ్రామపంచాయతీలలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లచే విష జ్వరాల పైన సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, అతిసారా, మెదడువాపు, డెంగీ, చికెన్గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చున్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఎక్కువ నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో మలేరియా వ్యాధిని వ్యాప్తి చెందించే దోమలు పెరుగుతాయన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రపర్చాలని, ప్లాస్టిక్కు నిరోధించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. మండలంలో ఫీవర్ సర్వేను నిర్వహించామని ప్రస్తుతం విష జ్వరాలు లేవన్నారు. ఎక్కువగా వ్యాధులు ప్రబలే ప్రాంతాలను గుర్తించి వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వంభర దినపత్రిక ఎఫెక్ట్ తో ప్రభుత్వ కళాశాల పరిసరాలు శుభ్రం కావడంతో విశ్వంభర పత్రికకు మండల ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.





## తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ..?

- బీఆర్ఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి హరిప్రసాద్

**విశ్వంభర, కరీంనగర్ :** తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చెయ్యకపోతే ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ నగర నడిబొడ్డులో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని నగర పాలక సంస్థ అధికారులు వన్ టౌన్ ఎదురుగా ఉన్న జంక్షన్‌ను అభివృద్ధి పేరుమీద చెప్పాపెట్టకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని నుంచి తీసేసి ఇప్పటి వరకు అసలు ఆ విగ్రహం ఎక్కడ ఉందో చెప్పకుండా దాచిపెట్టారో లేదా నగర పాలక సంస్థ అధికారులు అమ్ముకున్నరో స్పష్టంగా చెప్పకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని అవమాన పరుస్తున్నారని వారు అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు చొక్కారావు గారి విగ్రహాన్ని రాత్రి సమయంలో ఏర్పాటు చేశారు, అదే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చెయ్యలేదో సమాధానం చెప్పాలన్నారు. కరీంనగర్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఒక చరిత్ర ఉందని, తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్ ఒక గుండెకాయ అయితే, కరీంనగర్‌లో జరిగిన ఉద్యమానికి సజీవసాక్షి మన తెలంగాణ తల్లి విగ్రహం అని గుర్తు చేశారు. దాని నిర్మాణంలో అనేక పోరాటాలు అప్పటి సమైక్య పాలకులతో చేసి పోలీస్ కేసులను సైతం ఎదుర్కొని మరీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కనుక ఏర్పాటు చెయ్యకపోతే తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడి చేస్తాం అని హెచ్చరించారు.

## కర్నూలులో దళిత మహిళను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపిన వైనం

**విశ్వంభర, ఆదోని :** కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాతనహల్లి గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గుండమ్మ అనే దళిత మహిళను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపేశారు. రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అతని అనుచరులు పొలం తగాదా విషయంలో ఆ మహిళను హత్య చేసినట్లు తెలుస్తోంది. మహిళపై దాడి చేస్తుండగా అడ్డువచ్చిన పురుషోత్తమ రెడ్డి అనే వ్యక్తిపై కూడా నిందితులు దాడి చేశారు. దీంతో పురుషోత్తమ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహిళపై దాడి జరిగిన ప్రాంతానికి చేరుకున్న పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళ హత్యపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- రాబోయేది కాషాయ ప్రభుత్వమే
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ అసాధారణ విజయం సాధించిందని కేంద్ర మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి అన్నారు. 8 ఎంపీ స్థానాలు గెలుచుకోవడంతోపాటు 35శాతం ఓటు బ్యాంక్ సాధించినట్టు చెప్పారు. 46 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఫస్ట్‌ప్లేస్‌లో నిలవగా, 44చోట్ల రెండోస్థానంలో ఉందన్నారు. పదేళ్లు అధికారం ఉన్న బీఆర్ఎస్ మూడు అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే ఫస్ట్‌ప్లేస్‌లో ఉందన్నారు. కాంగ్రెస్ అయితే ఐదు నెలల్లోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు కిషన్‌రెడ్డి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రసాదన్, బండి సంజయ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గం, పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసినా మంచి ఫలితాలను బీజేపీ సాధించిందని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీ ప్రభుత్వమే అన్నారు. ఐదే ఐదు నెలల్లో 14శాతం నుంచి 35శాతానికి ఓట్ షేర్‌ను పెంచుకున్నట్టు చెప్పారు. ఏ రాష్ట్రంలోనూ ఏ పార్టీకీ ఈ స్థాయిలో ఓటు శాతం పెరగలేదన్నారు కిషన్ రెడ్డి. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల నుంచి మున్సిపాలిటీల వరకు అన్ని స్థానాల్లో బీజేపీ కైవసం చేసుకోవాలన్నారు. ఇక పార్టీ ఫిరాయింపులపై ఆనాడు బీఆర్ఎస్ చేసిందే.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు కిషన్‌రెడ్డి. రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటే అన్న కిషన్ రెడ్డి, దొందూ దొందే అంటూ సెటైర్లు పేల్చారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను భూస్థాపితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని యువకులు మహిళలు ప్రతి ఒక్కరు బీజేపీ పార్టీ వైపు చూస్తున్నారా అన్నారు. దేశంలో పేద ప్రజల సంక్షేమం నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీతోనే సాధ్యమైందన్నారు.



షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు. **– విశ్వంభర, షాద్‌నగర్**

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ




**విశ్వంభర, కుల్కచర్ల :** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ డబ్బులను వృధా చేయకుండా అవసరానికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తామన్నారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, ఇందిరమ్మ ఇండ్లపై కూడా కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మురళీధర్, డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, బ్లాక్ టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ ఎంపీపీ సత్యహరి చందర్, మండల పిఎసిఎస్ చైర్మన్ మొగులయ్య, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ పుంజాల అలేఖ్య వినయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, బాశెట్టి నర్సింగరావు. **– విశ్వంభర, కూకట్‌పల్లి**

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**విశ్వంభర, కూకట్‌పల్లి :** మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే అనారోగ్య బారిన పడతారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావుతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జబ్బుల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని సూచించారు. నీటి నిల్వ ఉన్నచోట దోమలు గుడ్లు ఉత్పత్తి అయ్యి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, కాబట్టి తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, కూకట్పల్లి సర్కిల్ ఎస్‌డబ్ల్యూ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ మమతా, ఎంటమాలాజీ ఏఈ ఉష పాల్గొన్నారు.

# ఘనంగా అరవింద శర్మ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆర్కే పురంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర నాయకులు భాలు శ్రీ, జగన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి కేకు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మేక్ ఇన్ ఇండియాలో భాగంగా
# ఏసర్‌తో జతకట్టిన ఇండ్‌కల్

**విశ్వంభర, హైదరాబాద్ :** మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థ అయిన ఇండ్‌కల్ టెక్నాలజీస్ ప్రముఖ గ్లోబల్ ఐసిటీ దిగ్గజం ఏసర్ సంస్థతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కింద స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ఇండ్‌కల్ టెక్నాలజీస్ సీఈఓ ఆనంద్ దూబే శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఇండ్‌కల్ భారత దేశంలో ఏసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్ ఫోన్ల రూపకల్పన, తయారీ, పంపిణీ చేస్తుందన్నారు. ఏసర్ గ్లోబల్ స్ట్రాటజిక్ అలయన్సెస్ వీపీ జేడ్ జౌ మాట్లాడుతూ ఈ పరికరాలు దేశ వ్యాప్తంగా ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్‌లలో అందుబాటులో ఉంటాయన్నారు.

## భారత విప్లవ రథసారథి అమరుడు
# కామ్రేడ్ దేవులపల్లికి విప్లవజోహార్లు



**విశ్వంభర, చివ్వేంల :** భారత విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు 40వ వర్ధంతి సభ శుక్రవారం మండల పరిధిలోని అక్కలదేవిగూడెంలో ఆయన స్థూపం వద్ద అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభను కామ్రేడ్ ఉప్పల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవాలు, అపారమైన ప్రజా ఉద్యమాలు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ అనేక నిర్బంధాలను, కేసులను, శిక్షలను హత్యలను సైతం ఎదుర్కొని పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేస్తూ వస్తుంది. కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి , చెప్పిన విప్లవ బాటలో ముందుకు నడుస్తూ అనేక పోరాటాలను, ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడంలో యువ కార్యకర్తల భుజస్కందాల పైన ఎక్కువ బాధ్యత ఉన్నది అని కామ్రేడ్ సురేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ ఎర్రయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుంకర రమేష్ బాబు, రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పోలెబోయిన ముత్తయ్య, సురేందర్, గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ కొనకంచి వీరభద్రయ్య, పాలకూరి ఎల్లయ్య, ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కత్తి లెనిన్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపూరం గ్రామంలో శుక్రవారం మండలాభివృద్ధి అధికారి ఎండీ నిరంజన్ వలీ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో దోమల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్క ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం కారణంగా దోమలు అధికంగా పెరిగే అవకాశం ఉంది కాబట్టి పరిసరాలలో ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించాలని తెలిపారు. ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, రెడ్డి కాలనీ వాసులకు డ్రైడే ఫ్రైడే పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ బోడిగే రమేష్, పంచాయతీ కార్యదర్శి ఉక్కుర్తి రమేష్, టీఏ దంతూరీ శ్రీశైలం, ఎఎన్ఎం పరకాల మమత, వీఓఏ అధ్యక్షురాలు దాచ శ్రీలత, ఉపాధి హామీ ఏఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి, ఆశకార్యకర్త రాచమల్ల రజిత, అంగన్వాడీ ఆయా ఎండీ నస్రీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, బట్టు బిక్షపతి, కోల మల్లయ్య, మీషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కండక్టర్ల సదస్సు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మహిళలకు బస్సు ప్రయాణంలో ఫ్రీ టికెట్ ద్వారా ఇస్తున్న టికెట్‌లపై మహిళా కండక్టర్లు టికెట్‌లను ఇవ్వడంలో కొంతమేర జాప్యం జరుగుతున్నా.. అధికారులు మహిళా కండక్టర్ల ను తీసివేయడం ఎంత వరకు సమంజసమని TGSTRC SWU INTUC జనరల్ సెక్రటరీ సయ్యద్ మహమూద్ ద్వజమెత్తారు. హైదరా బాద్ నారాయణ గూడలో ఏర్పాటు చేసిన మహిళా కండక్టర్ల సదస్సు సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా కండక్టర్లతో 8 గంటలు చేయాల్సిన డ్యూటీనీ ఎక్కవ సమయం చేయించడం సరికాదన్నారు. పీఆర్సీ డబ్బులు, ఉద్యోగ భద్రతను కల్పించాల ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం మెనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. మహిళలకు నెలకు మూడు రోజులు సెలవును ఇవ్వాలన్నారు. ఆర్టీసీలో యూనియన్‌లను పునరుద్దరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో మళ్లీ ఉద్యమం చేయాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు.

# చిట్టి వ్యాపారస్తుల వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



**విశ్వంభర, కూకట్‌పల్లి :** చిట్టి వ్యాపారస్తుల వేధింపులకు ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మూసాపేట్ ప్రగతి నగర్‌లోని సాయి కృష్ణ క్లాసిక్ అపార్ట్మెంట్లో వాచ్మెన్‌గా పనిచేస్తున్న బోనగిరి కనకయ్య(40), అదే అపార్ట్మెంట్లో నివాసముంటున్న చిట్టిల వ్యాపారి ఉషారాణి దగ్గర చిట్టి వేసేవాడు. చిట్టి తీసుకున్నానంతరం నెల డబ్బులు చెల్లించడంలో ఆలస్యం చేశా డు. దీనితో వ్యాపారి ఉషా ఆమె భర్త రెండు మూడు రోజులుగా కనకయ్యను ఇబ్బంది పెట్టారు. గురువా రం రాత్రి చిట్టి డబ్బులు విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి లోనైనా కనకయ్య శుక్రవారం ఉదయం అపార్ట్మెంట్ విద్యుత్ బాక్స్ ముట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓయూలో జర్నలిస్టులపై
# దాడి అమానుషం

టీజేయూ మండల అధ్యక్షుడు నరేష్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ వాయిదా వెయ్యాలని నిరుద్యోగ యువకులు ఆందోళన చేస్తుంటే దానిని న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన జీ తెలుగు న్యూస్ జర్నలిస్టు శ్రీచరన్‌ను పోలీ సులు వ్యవహరించే తీరును దారుణమని తెలం గాణ జర్నలిస్టు యూనియన్ గుండాల మండల అధ్యక్షులు సురారపు నరేష్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మగాని రాజు గౌడ్, మం డల ప్రధాన కార్యదర్శి సూదగాని హరికృష్ణ గౌడ్, టీజేయూ మండల ఉపాధ్యక్షులు చిలు కూరి మోహన్, కార్యవర్గ సభ్యులు పొన్నగాని యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.



## మధురాపూర్ ప్రైమరీ స్కూల్లో కిటికీలు, ఫ్యాన్లు ధ్వంసం

- మందు బాటిల్, నూడిల్స్ ప్యాకెట్లు గుర్తింపు
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



**విశ్వంభర, షాద్‌నగర్ :** ఫరూఖ్‌నగర్ మండలం లోని మధురాపురం గ్రామంలో ప్రైమరీ స్కూల్లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ప్రవేశం చేసి స్కూల్ కిటికీలు పగలగొట్టి తరగతి గదుల్లోని ఫ్యాన్లు విరగొట్టారు. అలాగే తరగతి గదుల్లో మందు బాటిళ్లు, నూడిల్స్ ప్యాకెట్లు వదిలి వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు షాద్‌నగర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఈ రకమైన పనులు చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన పోలీసు అధికారులు దర్యాప్తు చేసి నిందితు లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాలు ,సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి ఎస్సై చక్రపాణి విద్యార్థులకు వివరించారు. చాలా మంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కాలు యువత అలవాటు చేసుకోని ఆరోగ్యం పాడుచేసుకోవద్దని ఎస్సై తెలిపారు. యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసినా పోలీసులకు సమాచారం అందిచాలని అన్నారు. మంచికి దగ్గరగా, చెడుకు దూరంగా ఉండాలని, విద్యార్థులు మంచి ఆలోచనలతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఎస్సై చక్రపాణి అన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం మహాలక్ష్మి అమ్మవారు



**విశ్వంభర, మెట్పల్లి :** ఆషాడ మాసం వనభోజనాలకు ప్రతీక శుక్రవారం మెట్పల్లి పట్టణంవట్టి వాగు సమీపంలో గల మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ఆషాడ మాస శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రీతికరమైన రోజు ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారులు ప్రశాంత్ స్వామి అమ్మవారిని తెల్లవారుజామునే ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వచ్చే ఆదివారం అమ్మవారికి బోనాలతో గంగ పుత్రులు గొల్లాలతో ఊరేగింపుగా వచ్చి మహాలక్ష్మి అమ్మవారికి సమర్పిస్తారు. నూతనంగా పెళ్లైన జంటలు వారికి పుట్టిన మొదటి సంతానాన్ని అమ్మవారికి ఒడిలో పెట్టి ప్రత్యేక పూజలు చేయిస్తారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం శ్రీ మహాలక్ష్మి మాత కటాక్షం కలగాలని కోరుకుంటారు.

# పచ్చదనంతోనే భవిష్యత్తు తరాలకు భరోసా

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- వన మహోత్సవం యజ్ఞంలా కొనసాగాలి
- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, షాద్‌నగర్ :** పచ్చటి మొక్కలు నాటడం భవిష్యత్తు తరాలకు మంచి భరోసా ఇవ్వడమేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అదేవిధంగా వనమహోత్సవం ఒక యజ్ఞంలా కొనసాగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డిగ్రీ కళాశాల మైదానం, పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ చైర్మన్ నరేందర్ కమిషనర్ చీమ వెంకన్న, కౌన్సిలర్లు స్థానిక నేతలు కార్యకర్తలు అధికారులు సిబ్బంది కమిషనర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ వ్యాప్తంగా వన మహోత్సవం పురస్కరించుకొని మొత్తం 1.10 లక్షల మొక్కలు నాటుతామని తెలిపారు. వరమోత్సవం మొదటిరోజు వెయ్యి ముక్కలు నాటుతున్నామని చెప్పారు. డిగ్రీ కళాశాల మైదానంలో 500 మొక్కలు ఇతర బహిరంగ ప్రదేశాలలో మరో 500 మొక్కలు ఒక్క రోజుల్లోనే నాటుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాలని, నాటడంతోపాటు, వాటి సరంక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ రవీందర్ రెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, విశాలా విశ్వం, బాలరాజ్ గౌడ్, ఎంపీటీసీ కృష్ణ, జూపల్లి కౌసల్య, పిల్లి శారద శేఖర్, ఇబ్రహీం, కౌన్సిలర్ జిటి శ్రీనివాస్, ఆలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, ఈశ్వర్ రాజు, ముబారక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**విశ్వంభర, ఆమనగల్లు/కల్వకుర్తి :** కల్వకుర్తి ప్రాంతవాసి అయిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలో బస్టాండ్ ఆవరణలో రెండు నూతన బస్సులను జండా ఊపి ప్రారంభించి బస్సును నడిపిన ఎమ్మెల్యే అనంతరం పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కల్వకుర్తి మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఫుటుబాల్ పోటీలను ఎమ్మెల్యే జండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల క్రీడాకారులకు రాష్ట్రస్థాయి ఫుటుబాల్ పోటీలను కల్వకుర్తి మినీ స్టేడియంలో నిర్వహించడం చాలా సంతోషమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫుటుబాల్ క్రీడా అంటే చాలా ఇష్టమని ఆయన అన్నారు. మినీ స్టేడియంను ముఖ్యమంత్రి సహకారంతో అన్ని క్రీడలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.




## ప్రభుత్వాలు మారిన ఉపకార వేత(నా)లు తీరవా..?

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు స్మరణ, కుమ్మరి రాజ్ కుమార్

**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు స్మరణ, కుమ్మరి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపకార వేతనాలు విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ మాట్లడుతూ.. గత ఆరేళ్ళ నుంచి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదని రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. వీరికి సంవత్సరానికి 3000 వేల కోట్లు అవసరం అవుతాయని కానీ 2019 నుండి ఇప్పటి వరకు బకాయిలు మొత్తం 8214.57 కోట్లు రూపాయలు ఫీజుల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుంచి ఒక్కరూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదని దుయ్య బట్టారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదని, ఉన్నత చదువులకు వెళ్ళాలనే విద్యార్థులు తల్లిదండ్రులు సర్టిఫీకెట్స్ కోసం వడ్డీలకు అప్పులు చేస్తున్న దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొంది అని అన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాల నడపడానికి బయట నుండి అప్పులు తెచ్చామని ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతవేసే పరిస్థితి ఉందని వాపోతున్నారు. కనుక తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ మాట్లాడుతూ స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయంబర్స్ మెంట్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు, వాటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ఆయా మార్గదర్శకాలు ప్రభుత్వమే అమలు చేయడం లేదు అని అన్నారు. తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు చదువుకోవడానికి అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున విద్యార్థులు అందరితో కలిసి ఉద్యమాలు నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సాయి, ప్రవీణ్, చందు, ఈశ్వర్, నరేష్, స్వామి, సుధీర్ పాల్గొన్నారు.



## నీచమైన రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు టీటీడీ బోర్డు మెంబర్ గా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 150 వివిధ దేవాలయాల అభివృద్ధి కొరకు మరియు జగిత్యాల జిల్లాలో గల 85 దేవాలయాలకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కానీ నియోజకవర్గంలోని కొందరు కాంగ్రెస్ నాయకులు జువాడి బ్రదర్స్ తాము నిధులు మంజూరు చేయించినట్లు ప్రొసీడింగ్ లెటర్స్ అందిస్తూ ఫోటోలకు ఫోజు ఇవ్వడం విడ్డూరం గా ఉందని ఎద్దేవ చేశారు. వేరొకరు చేసిన మంచి పనిని తాము చేసినట్టు గొప్పలు చెప్పుకోవడం కాంగ్రెస్ నాయకులకు కొత్త కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా.. ఆర్థిక అభివృద్ధిలో ప్రజలకు చేసింది ఏమీ లేదని సొంత ప్రయోజనాల కొరకు పార్టీలు మారుతున్న నాయకులకు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్తారని అన్నారు. ఇది ఇలా ఉండగా ఎండోమెంట్ అధికారులను ఒత్తిడి చేసి ప్రొసీడింగ్ లెటర్స్ పొందినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రెండు సంవత్సరాలు కష్టపడి టీటీడీ అధికారులు రామనాథం ఇతర అధికారులు వచ్చి గుడులను పరీక్షించి నిధులు మంజూరు చేస్తే మేమే చేశాము అని కాంగ్రెస్ నాయకులు జువ్వడి బ్రదర్స్ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. దేవుడి గుడిలతో రాజకీయం చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మెట్పల్లి మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి, కోరుట్ల మాజీ ఎంపీపీ తోట నారాయణ, మల్లాపూర్ మండల నాయకులు, ఇబ్రహీంపట్నం మండల నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు కౌన్సిలర్ లక్ష్మణ ఆధ్వర్యంలో శివాలయం నగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు నివారణకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలంటూ మున్సిపాలిటీ అధికారులు, మున్సిపాలిటీ కౌన్సిలర్ వార్డులో పర్యటిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దామోదర్, వెంకటేష్ వార్డు అధికారులు ఎల్లయ్య, సంతోష, గౌతమి, భాగ్యలక్ష్మి, సాయిరాం కాలనీ వాసులు పాల్గొన్నారు.



# శరద్ పవార్‌తో మమతా బెనర్జీ భేటీ

## ప్రస్తుత రాజకీయాలపై చర్చ.. పాల్గొన్న పవార్ కుమార్తె

**విశ్వంభర, హైదరాబాద్ :** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఎన్సీపీ ఎస్సీపీ నేత శరద్ పవార్‌తో శుక్రవారం సాయంత్రం ముంబైలో భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై వీరు చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పవార్ కుమార్తె, సుప్రియా సూలే కూడా పాల్గొన్నారు. ఇక ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల వివాహానికి హాజరయ్యేందుకు ముంబై చేరుకున్న మమతా బెనర్జీ దేశ వాణిజ్య రాజధానిలో బిజీ షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకున్నారు. దీదీ అంతకుముందు ముంబైకి బయలుదేరేముందు కోల్‌కతాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, అఖిలేష్ యాదవ్‌తో విడివిడిగా భేటీ కానున్నట్టు ఆమె వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వీరితో సమావేశం కానున్న దీదీ.. జాతీయ రాజకీయాలపైనా చర్చించనున్నట్టు తెలిపారు. 'ముఖేశ్ అంబానీ కుమారుడి పెళ్లి కోసం నేను ముంబై వెళ్తున్నాను. రేపు ఉద్ధవ్ ఠాక్రేతో నాకు అపాయింట్‌మెంట్ ఉంది, అలాగే శరద్ పవార్‌ను కూడా కలవనున్నా.. లోక్‌సభ ఎన్నికల తర్వాత వారితో సమావేశం కానున్నాను, రాజకీయ చర్చ ఉంటుంది.. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కూడా అక్కడికి వస్తారు. ఆయన్ని కూడా కలిసే అవకాశం ఉంది' అని సీఎం మమతా బెనర్జీ మీడియాకు తెలిపారు.




# నదిలో కొట్టుకుపోయిన రెండు బస్సులు

- 66 మంది మృతి
- నేపాల్‌లో దారుణ ఘటనలు

**విశ్వంబర, ఢిల్లీ :** హిమాలయ దేశం నేపాల్‌లో కొండచరియలు విరిగిపడటంతో ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులు నదిలోకి దూసుకెళ్లాయి. దీంతో 66 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు. ఏంజెల్ బస్సు, గణపతి డీలక్స్ దేశ రాజధాని ఖట్మండూకి వెళ్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 3 గంటలకు సెంట్రల్ నేపాల్‌లోని మదన్-ఆశ్రిత్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అదుపుతప్పిన రెండు బస్సులు త్రిశూలి నదిలో పడిపోయాయి. నదీ ప్రవాహ తీవ్రతతో అవి రెండు కొట్టుకుపోయాయని ప్రభుత్వ ప్రతినిధి ఖిమా నంద భుసాల్ చెప్పారు. ఓ బస్సులో 24 మంది ఉండగా, మరో బస్సులో 41 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. గల్లంతైనవారికోసం గాలిస్తున్నామని చెప్పారు. అయితే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నదని తెలిపారు. కాగా, నేపాల్‌లో వర్షాకాలం జూన్‌లో మొదలై సెప్టెంబర్‌లో ముగుస్తుంది. ఈ సమయంలో హిమాలయదేశంలో భారీ వర్షాలు కురుస్తాయి. దీంతో విరివిగా కొండచరియలు విరిగిపడుతూ ఉంటాయి.



# అంబానీ పెళ్లిలో సినీ తారల కోలాహలం

**విశ్వంభర, ముంబై :** ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మరికాసేపట్లో అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ దంపతులు కాబోతున్నారు. ఈ వివాహ వేడుక చూసేందుకు సినీ తారలంతా తరలివచ్చారు. ముంబైలోని 'జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో అట్టహాసంగా అంబానీ పుత్రుడి వివాహం జరుగుతోంది. తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కుటుంబ సమేతంగా ఈ విహహ వేడుకకు హాజరయ్యారు. తన భార్య, కూతురు, అల్లుడు, మనవరాలుతో కలిసి ఆయన పెళ్లి వచ్చారు. అదేవిధంగా నటులు సంజయ్‌దత్, అనిల్ కపూర్, అర్జున్ కపూర్ వరుణ్ ధావన్, క్రితి సనన్ వేడుకలో సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన భార్యతో కలిసి వచ్చారు. నటి జెనీలియా డిసౌజా తన భర్త రితేష్ దేశ్‌ముఖ్‌తో కలిసి విచ్చేశారు.

# నేను రెండోసారి సీఎం కావడం వారికి ఇష్టం లేదు: సిద్ధరామయ్య



**విశ్వంభర, మైసూర్ :** తాను రెండోసారి ముఖ్యమంత్రి కావడం బీజేపీ నేతలకు ఇష్టం లేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. తాను సీఎం కావడాన్ని వారు ఓర్చుకోలేకపోతున్నారని చెప్పారు. అధ్వానంగా తయారైన ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ)ను దారిలోకి తీసుకొస్తానని అన్నారు. ముడాలో జరిగిన అవినీతిపై ఇద్దరు ఐఏఎస్ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని చెప్పారు. బీజేపీ హయాంలోనే కాకుండా తమ ప్రభుత్వంలో కూడా తప్పులు జరిగాయని... అన్నింటినీ సరి చేస్తానని చెప్పారు. తాను సీఎం కావడం ఇష్టం లేనివారు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన భార్య పార్వతి పేరిట ఇంటి స్థలం కేటాయించడం అక్రమం ఎలా అవుతుందని ప్రశ్నించారు. తన భార్యకు ఇంటి స్థలాన్ని మంజూరు చేసినప్పుడు బీజేపీనే అధికారంలో ఉందని చెప్పారు. గతంలో ముడా తప్పు చేసిందని... దానికి పరిహారంగా ఆ తర్వాత ఇంటి స్థలం ఇచ్చిందని తెలిపారు. భూమి కోల్పోయిన తాము ఇంటి స్థలాన్ని పొందడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమ ఇంటి స్థలాన్ని వెనక్కి తీసుకుని... వడ్డీతో కలిపి రూ.62 కోట్లు చెల్లించినా అభ్యంతరం లేదని చెప్పారు.

# కేజ్రీవాల్‌కు బెయిల్



**విశ్వంభర, ఢిల్లీ :** కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విస్తృత స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యులున్న ధర్మాసనానికి కేసును బదిలీ చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అయితే 90రోజులుగా సీఎం కేజ్రీవాల్ జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. మార్చి 21న లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. దానిపై విచారణ జరిపారు. అదే క్రమంలో ఆయన బెయిల్ కోసం అనేక సార్లు కోర్టును ఆశ్రయించారు సీఎం కేజ్రీవాల్. లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రచారం నిమిత్తం 21 రోజుల పాటూ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది ఢిల్లీ హైకోర్టు. అయితే ఆ బెయిల్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని వేసిన పిటిషన్ ను కొట్టేసింది ఢిల్లీ హైకోర్టు. దీనిపై స్పెషల్ కోర్టులను ఆశ్రయించాలని సూచించింది. దీంతో కేజ్రీవాల్ తరఫు న్యాయవాదులు స్పెషల్ కోర్టులో పలుసార్లు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఇక మధ్యంతర బెయిల్ ముగియడంతో పోలింగ్ ముగిసిన తర్వాత కౌంటింగ్‌కు రెండు రోజుల ముందు జూన్ 2న తిరిగి తిహార్ జైల్లో కేజ్రీవాల్ లొంగిపోయారు. ఇదే ఢిల్లీ లిక్కర్ స్కాములో సీబీఐ కూడా సీఎం కేజ్రీవాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపింది. ఈ తరుణంలో రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్.. బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పెషల్ కోర్టు సానుకూలంగా స్పందించి బెయిల్ ఇస్తే, ఢిల్లీ హైకోర్టు దానిని కొట్టేసింది. దీంతో సీఎం కేజ్రీవాల్ న్యాయవాదులు స్పెషల్ కోర్టు ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు కొట్టేయడాన్ని సవాలు చేస్తూ మరో బెయిల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. సీఎం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీం కోర్టు జూలై 12న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ తరఫు వాదనలను ఏకీభవించని సుప్రీం కోర్టు.. కేజ్రీవాల్ ప్రజాప్రతినిధి అని పేర్కొంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం. దీంతో పాటూ ఈ కేసును విస్తృత స్థాయి విచారణ నిమిత్తం ఐదుగురు సభ్యులు ఉన్న బెంచ్‌కు బదిలీ చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 90 రోజులపాటు తిహార్ జైలులో ఉన్న సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌తో స్వల్ప ఊరట లభించినట్లయింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈడీ కేసుల్లో దాఖలు చేసిన పిటిషన్‌పై మాత్రమే జోక్యం చేసుకున్న సుప్రీం కోర్టు.. సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ సీబీఐ కేసుల్లో సుప్రీంకోర్టు ఎలాంటి బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో రిమాండులోనే కొనసాగనున్నారు సీఎం కేజ్రీవాల్. ఒక వేళ బయటకు రావాలంటే.. సీబీఐ కేసుల్లో కూడా మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దానిని స్వీకరించి విచారణ జరిపిన తరువాత ఇచ్చే కోర్టు ఆదేశాలపై ఆధారపడి ఉంటుంది. అంత వరకూ కేజ్రీవాల్ బయటకు వచ్చేందుకు అవకాశం ఉండదు. ఇప్పుడు బెయిల్ మంజూరైంది కేవలం ఈడీ కేసుల్లోనే అన్నది గమనించాల్సి విషయం. మరి రానున్న రోజుల్లో సీఎం కేజ్రీవాల్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.



# రోజులో ఒక్కసారైనా నవ్వాల్సిందే

## జపాన్ ప్రభుత్వ కొత్త చట్టం

**విశ్వంభర, ఢిల్లీ :** ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఉపయోగపడే, నేరాలను అరికట్టే చట్టాలను అమల్లోకి తెస్తారు. అయితే, జపాన్ ప్రభుత్వం మాత్రం ప్రతి రోజూ అందరూ నవ్వాలని చట్టం తీసుకొచ్చింది. యమగట ప్రిఫెక్చర్ ప్రభుత్వం 'లాఫింగ్ లా'ని తీసుకొచ్చింది. ఈ మేరకు ఆర్డినెన్స్ జారీ చేసింది. పౌరుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. నవ్వడం ఆరోగ్యానికి మంచిది అంటారు. ఈ క్రమంలో యమగట విశ్వవిద్యాలయంలోని 'ఫ్యాక్టరీ ఆఫ్ మెడిసిన్' చేసిన పరిశోధనల్లో తక్కువగా నవ్వే వారిలో కొంతమంది వివిధ వ్యాధులతో మరణిస్తున్నారని తేలింది. ఈ పరిశోధన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రోజులో ఒక్కసారి తప్పకుండా నవ్వాలని చట్టం తీసుకొచ్చింది. పని ప్రదేశంలో నవ్వుతో కూడిన వాతావరణాన్ని ప్రోత్సహించాలంటూ కంపెనీలను కూడా ఆదేశించడం విశేషం. ప్రతినెలా ఎనిమిదో తేదీని ప్రత్యేకంగా 'హాస్యంతో ఆరోగ్యం' కోసం కేటాయించాలని సూచించింది. అయితే, ఈ చట్టంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నవ్వొస్తే నవ్వుతారు కానీ కచ్చితంగా రోజులో ఒకసారైనా నవ్వాల్సిందేనని చట్టం తేవడమేంటి అని జపాన్ కమ్యూనిస్టు పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. వ్యక్తిగత కారణాల వల్ల కొంత మంది నవ్వలేకపోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి చట్టాలతో ప్రజల హక్కులను కాలరాయొద్దని తీవ్రంగా మండిపడుతున్నారు. అయితే, విమర్శలను అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ కొట్టిపారేసింది. నవ్వడం ప్రజల ఇష్టానికే వదిలేస్తున్నట్లు తెలిపింది. అందుకే నవ్వకపోతే జరిమానా విధిస్తాం వంటి అంశాలను చట్టంలో పొందుపరచలేదని వివరించింది.

# ప్రతి ఏడాది జూన్ 25న 'రాజ్యాంగ హత్యాదినం'



**విశ్వంభర, ఢిల్లీ:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 49 ఏళ్ల క్రితం దేశంలో ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదీని 'సంవిధాన్ హత్యా దివస్' (రాజ్యాంగ హత్యాదినం)గా పాటిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 1975, జూన్ 25న ఇందిరా గాంధీ నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడంతో రెండేళ్లపాటు పౌర హక్కులను భంగం కలిగింది. ఎమర్జెన్సీ రోజులను బీజేపీ పదే పదే గుర్తుకు తెస్తుంది. 'సంవిధాన్ హత్యా దివస్'ను ప్రకటించిన గెజిట్ నోటిఫికేషన్ కాపీని కేంద్ర మంత్రి అమిత్ షా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నియంతృత్వ ఆలోచనా ధోరణిని ప్రదర్శిస్తూ ఎమర్జెన్సీని విధించారని అందులో పేర్కొన్నారు. ఎమర్జెన్సీ వల్ల ప్రజాస్వామ్యాన్ని ఊపిరి ఆడకుండా చేశారని చెప్పారు. తప్పు చేయని లక్షలాది మందిని జైల్లో వేశారని తెలిపారు. మీడియా గళాన్నీ ఎత్తకుండా చేశారని అన్నారు. దీంతో భారత సర్కారు ప్రతి ఏడాది జూన్ 25వ తేదీని 'సంవిధాన్ హత్యా దివస్'గా నిర్వహించాలని నిర్ణయించిందని స్పష్టం చేశారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అమానవీయ దుర్ఘటనలను ఎదుర్కొన్న వారిని జూన్ 25న భారత్ స్మరించుకుంటుందని చెప్పారు.

# చూపరులను కట్టిపడేస్తున్న ఎవరెస్ట్ శిఖరం అందాల డ్రోన్ వ్యూ




**చైనా:** ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం చూడాలని ఎవరికి ఉండదు? కానీ అక్కడి వాతావరణ పరిస్థితులు తట్టుకోలేకనో... ఆర్థిక స్తోమత లేకనో... వీలు దొరకకనో... ఇలా మరేదైన కారణంతోనో దానిని దగ్గరి నుంచి చూసే అవకాశం ఎంతోమందికి ఉండదు. అలాంటి వారి కోరికను తీర్చడానికి చైనాకు చెందిన ప్రముఖ డ్రోన్ తయారీ సంస్థ డీజేఐ గ్లోబల్... డ్రోన్ సహాయంతో అద్భుతమైన వీడియోను తీసింది. సముద్రమట్టానికి 3,500 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్ నుంచి డ్రోన్‌ను ప్రయోగించారు. అక్కడి నుంచి శిఖరాగ్రం వరకు ఈ డ్రోన్ వరుసగా వీడియోను తీస్తూ కదిలింది. ఎవరెస్ట్ శిఖరం ఎక్కుతున్న వారు... దిగుతున్న వారు కూడా ఈ వీడియోలో కనిపించారు. వీడియోలో హిమనీ నదాలు, తెల్లటి మంచు దుప్పటి కప్పినట్లుగా ఉన్న ప్రాంతాలు కనిపిస్తాయి.



# ఎమర్జెన్సీ తర్వాత కూడా దేశాన్ని పాలించాం

- కేంద్రం తీరు సరికాదు
- డీకే శివకుమార్ వ్యాఖ్యలు

**విశ్వంభర, బెంగుళూరు:** ఎమర్జెన్సీకి నిరసనగా జూన్ 25న రాజ్యాంగ హత్యా దినంగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. ఎమర్జెన్సీ అనంతరం కాంగ్రెస్ పార్టీ ఈ దేశాన్ని పాలించిందని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు ప్రధానులుగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఈ దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించారని డీకే శివకుమార్ చెప్పుకొచ్చారు. కాగా, 1975 జూన్ 25న నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన రోజును ఇకపై ఏటా సంవిధాన్ హత్యా దినంగా పాటించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం ప్రకటించారు. జూన్ 25ను సంవిధాన్ హత్యా దివస్‌గా కేంద్రం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అమిత్ షా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో లక్షలాది మందిని కటకటాల్లోకి నెట్టారని బీజేపీ ఆరోపిస్తోంది. ఎమర్జెన్సీ రోజులకు నిరసనగా సంవిధాన్ హత్యా దివస్‌ను పాటించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి దేశంలో చీకటి అధ్యాయానికి తెరలేపారని ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ అగ్రనేతలు వీలుచిక్కినప్పుడల్లా కాంగ్రెస్‌పై విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగాన్ని ఏమాత్రం ఖాతరు చేయని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాజ్యాంగం పట్ల ప్రేమ ఒలకబోస్తోందని పలు సందర్భాల్లో కాషాయ నేతలు కాంగ్రెస్‌పై భగ్గుమన్నారు.

# దళిత యువకుడిపై అమానుషంగా దాడి

**విశ్వంభర, యూపీ :** ముగ్గురు వ్యక్తులు దళిత యువకుడ్ని కొట్టారు. అతడితో బలవంతంగా మూత్రం తాగించారు. ఆ యువకుడి కుటుంబం దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 15 ఏళ్ల దళిత యువకుడు, అతడి కుటుంబం గ్రామంలో డీజే నిర్వహిస్తోంది. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో సౌండ్, ఆడియో సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తారు. కాగా, ఆ యువకుడు మంగళవారం రాత్రి ఒక ఫంక్షన్‌లో డీజే ఏర్పాటు చేశాడు. అయితే జనరేటర్‌లో ఇంధనం లేకపోవడంతో డీజే నిలిపివేశాడు. అదనంగా డబ్బులు డిమాండ్ చేయడంతో ముగ్గురు వ్యక్తులు అతడితో ఘర్షణకు దిగారు. కార్యక్రమం తర్వాత ఇంటికి వెళ్తున్న యువకుడ్ని వారు అడ్డుకుని కొట్టారు. బాటిల్‌లో మూత్రం పోసి బలవంతంగా అతడితో తాగించారు. దీనిని వీడియో రికార్డ్ చేసి సర్క్యులేట్ చేశారు. మరోవైపు ఇంటికి చేరుకున్న ఆ యువకుడు ఈ విషయాన్ని తన కుటుంబానికి తెలిపాడు. మరునాడు అతడి పేరెంట్స్, సోదరుడు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపిన పోలీసులు కిషన్ తివారీ, దిలీప్ మిశ్రా, సత్యం తివారీని గురువారం అరెస్ట్ చేశారు. దిలీప్ మిశ్రా మద్యం బాటిల్‌లో మూత్ర విసర్జన చేసినట్లు పోలీసులు తెలిపారు. సత్యం, కిషన్ కలిసి ఆ యువకుడి నోటి వద్ద బాటిల్ ఉంచి బలవంతంగా మూత్రాన్ని తాగించారని చెప్పారు. వీడియో క్లిప్ చూసిన తర్వాత కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

విశ్వంభర V3 NEWS



## టీడీపీలో చేరనున్న వైసీపీ ఎమ్మెల్సీలు..?

**• జగన్‌కు షాక్ ఇవ్వబోతున్న ఐదుగురు..? • కండీషన్ పెడుతున్న చంద్రబాబు**

**విశ్వంభర, విశాఖపట్నం :** ప్రస్తుతం శాసనమండలిలో వైసీపీకి 30 మంది, టీడీపీకి 9, జనసేనకు 1, పీడీఎఫ్ కు 2, ఇండిపెండెంట్లు 4, నామినేటెడ్ అయిన సభ్యులు 8 మంది ఉన్నారు. మరో నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొందరు వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీ మారడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది. ముఖ్యంగా రాయలసీమలోనే ఐదుగురు ఎమ్మెల్సీలు ఈ బాటలో ఉన్నారని అంటున్నారు. వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన జకియా ఖానం, అలాగే మైనార్టీ వర్గానికే చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్సీలతో పాటు, ఉపాధ్యాయ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికయిన మరో ఇద్దరు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ గా ఉన్న జకియా ఖానం పార్టీ మారతారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఆమె ఇప్పటికే కర్నూలు జిల్లాకు చెందిన మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీలో చేరడానికి ఆమె ఆసక్తి చూపినట్టు తెలుస్తోంది. రాయచోటికి చెందిన తమను రాజకీయంగా ఎదగనీయకుండా వైసీపీలో కొందరు నేతలు కుట్రపన్నారని జకియా ఖానం ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. వైసీపీ ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీలకు ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదని.. కేవలం తమను ఉత్సవ విగ్రహాల మాదిరిగానే చూశారని ఆమె బాధపడినట్టు తెలుస్తోంది. చంద్రబాబే నా రాజకీయ గురువు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హాట్ కామెంట్స్! అలాగే పార్టీ మారాలనుకుంటున్న ఎమ్మెల్సీలు కూడా ఇదే భావనతో ఉన్నట్టు తెలుస్తోంది. ఐదేళ్లలో ఏనాడు వైసీపీ అధినేత జగన్ తమతో భేటీ కాలేదని.. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోగానే తమను పిలిచి.. ప్రభుత్వం పోరాటం చేయాలంటున్నారని మరికొందరి ఎమ్మెల్సీలు మండిపడుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రాయలసీమకు చెందిన ఐదుగురు ఎమ్మెల్సీలు టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. కాగా అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు, వివాదాస్పదులైన నేతలు, అసభ్యంగా మాట్లాడుతూ బూతులు తిట్టేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలో చేర్చుకోవద్దని ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఎలాంటి వివాదాలు లేనివారు, సౌమ్యులు అయితేనే టీడీపీలో చేర్చుకోవడానికి చంద్రబాబు మొగ్గుచూపుతున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరాలనుకుంటున్న వైసీపీ నేతలకు టీడీపీ నేతలు ఇదే విషయాన్ని చెబుతున్నారు. పార్టీలో చేరికకు చంద్రబాబు, నారా లోకేశ్ ఒప్పుకుంటేనే అని మెలికపెడుతున్నారని తెలుస్తోంది.

## 23 నుంచి 'పొలం పిలుస్తోంది'

**• రైతులకు అవగాహన కల్పిస్తాం**
**• మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన**



**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం అమలు దస్త్రంపై తొలి సంతకం చేశారు. ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిని వివరించి రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. వైసీపీ హయాంలో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వెల్లడించారు. వ్యవసాయ రంగం కుదేళయ్యిం దని ఆరోపించారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు.

## బీజేపీ ఒకలా చెబితే.. చంద్రబాబు మరోలా చెప్పారు

**మాజీ మంత్రి పేర్ని నాని**



**విశ్వంభర, గుంటూరు :** రోజుకొక శ్వేతపత్రం పేరుతో కూటమి ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపుతోందని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు బీజేపీ చెబితే.. సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం రూ.10 లక్షల కోట్లని అసత్యాలు చెబుతున్నారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు చేతులెత్తేశారని అన్నారు. ఐదేళ్ల క్రితం జగన్ ముఖ్యమంత్రి అయ్యేనాటికే ఖజానా ఖాళీ అయిందని చెప్పారని అన్నారు. ఇక అప్పు కూడా పుట్టదని యనమల రామకృష్ణుడు అన్నారని తెలిపారు. అమరావతి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పట్లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. నారా లోకేశ్ రెడ్ బుక్‌లో రాసుకున్న వారందరి మీద తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారని తెలిపారు. చంద్రబాబే పోలవరాన్ని నాశనం చేశారని అన్నారు. ఆయనకు ఇష్టమైన వారికి కాంట్రాక్టు ఇచ్చి పనులు చేయించారని ఆరోపించారు. అమ్మకు వందనం పేరుతో తల్లీపిల్లల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. జగన్ ఒకరికే ఇస్తున్నారని తాము అధికారంలోకి వస్తే పిల్లలందరికీ అమ్మకు వందనం డబ్బు ఇస్తామన్నారని చెప్పారు. ఇప్పుడు పిల్లలకు పంగనామాలు పెట్టారని తెలిపారు. చంద్రబాబు మాటల్లో నిజాయితీ ఉండదని చెప్పారు.

# ఒక్క రోజులో మార్పు రాదు

**• సమయం పడుతుంది**
**• డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**విశ్వంభర, అమరావతి :** రాష్ట్రంలోని పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. పంచాయతీల్లో ఎక్కడా డబ్బులు లేవని తెలిపారు. ఒక్క రోజులో పంచాయతీల దుస్థితిని మార్చలేమని అభిప్రాయపడ్డారు. పంచాయతీల్లో మార్పు తీసుకొచ్చేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి శుక్రవారం పవన్ కల్యాణ్ వచ్చారు. ఈ సందర్భంగా సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరంపంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్‌పై పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జలం మనకు పూజ్యనీయమని.. కాలుష్యం కాకుండా కాపాడుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ప్లాస్టిక్ చెత్తాచెదారంతో ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు అని అన్నారు. మనుషులకే కాదు.. జంతువులకు కూడా ప్రమాదకరమే అని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆవులు చనిపోవడం బాధగా ఉందని అన్నారు. పంట కాలువలు డంపింగ్ యార్డుల్లా మారాయని అన్నారు. కాలువల్లో చెత్తను వేస్తే నీరు కలుషితమవుతుందని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ సరిగ్గా జరగడం లేదని అన్నారు. చెత్త నిర్మూలనకు ప్రతి ప్రభుత్వం ప్రయత్నిం చాలని అభిప్రాయపడ్డారు. ఏటా రూ.243కోట్ల విలువైన వ్యర్థాలను పాడేస్తున్నామని చెప్పారు. చెత్త, వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేసి పంచాయతీలు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఠాపురంలోని తన కార్యాలయం నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిశుభ్రతను ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఒక్కో పంచాయతీలో చెత్త సేకరించి సంపద సృష్టించే ప్రయత్నం చేస్తామన్నారు. పనికిరాదని మనం పడేసే చెత్తతో ఏటా రూ.2643 కోట్ల ఆదాయం రావచ్చని అన్నారు.రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు వీలవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని పంచాయతీల్లో ఎక్కడా డబ్బుల్లేవని అన్నారు. పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యంచేసిందని ఆరోపించారు. ఒక్క రోజులో పంచాయతీల దుస్థితిని మార్చలేమన్నారు. పంచాయతీల్లో మార్పు తెచ్చేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు.

## సమస్యలుంటే మెయిల్ చేయండి

**ప్రతి దానిపై స్పందిస్తా : మంత్రి నారా లోకేష్**



**విశ్వంభర, అమరావతి :** ప్రజా సమస్యలు, వినతులపై ఇక నుంచి తనకు వాట్సాప్ చేయవద్దని ఏపీ మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రజల నుంచి వరదలా వచ్చిన మెసేజ్‌లతో సాంకేతిక సమస్యలు వచ్చి తన వాట్సాప్ అకౌంట్‌ను మెటా బ్లాక్ చేసిందని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నా.. సహాయం కావాలన్నా ఇకనుంచి తన పర్సనల్ మెయిల్ ఐడీకి మాత్రమే పంపించాలని రిక్వెస్ట్ చేశారు. పాదయాత్రలో య-ువతకు తనను చేరువ చేసిన హాలో లోకేశ్ కార్యక్రమం పేరుతోనే ఒక మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకున్నానని నారా లోకేశ్ తెలిపారు. hello.lokesh@ap.gov.in మెయిల్ ఐడీ ద్వారానే తనకు సమస్యలు, వినతులను పంపించాలని ప్రజలకు సూచించారు. మీ పేరు, ఊరు, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ, సమస్య లేదా సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలను మెయిల్‌లో పేర్కొనాలని చెప్పారు. మీకు సహాయం చేయడం, సమస్య పరిష్కరించే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే నారా లోకేశ్ ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. ఉండవల్లిలోని తన నివాసంలో రోజూ ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే వాట్సాప్‌లో కూడా వినతులు తీసుకుంటున్నారు. అయితే ఫిర్యాదులు, వినతులకు సంబంధించి తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు ఎక్కువ కావడంతో నారా లోకేశ్ వాట్సాప్ బిజినెస్ అకౌంట్ తరచూ బ్లాక్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే మెయిల్ ద్వారానే వినతులు స్వీకరించాల ని నారా లోకేశ్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని తన ట్విట్టర్ ఖాతా ద్వారా ప్రజలకు తెలియజేశారు.

## ఏపీని జగన్ అప్పుల పాలు చేశాడు

**చంద్రబాబు దాన్ని కంటిన్యూ చేయొద్దు : ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల**





**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, జగన్ సోదరి వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం ఏపీ రాష్ట్ర పరిస్థితి గందరగోళంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం వెలిబుచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో నెట్టాడని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక స్థితిని గాడిలో పెట్టడం ప్రస్తుత ముఖ్యమంత్రికి కష్టసాధ్యమైన పనేనని అన్నారు. 'కానీ, ఆయన (చంద్రబాబు నాయుడు) ఇప్పుడు ముఖ్యమంత్రి. కాబట్టి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాల్సిన బాధ్యత ఆయనపై ఉన్నది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సాధ్యమైనంత త్వరగా నెరవేర్చాలని మేం చంద్రబాబు నాయుడును కోరుతున్నాం. ఇంకా ఆలస్యమవడాన్ని ఆంధ్రప్రదేశ్ భరించలేదు' అని షర్మిల వ్యాఖ్యానించారు. రాష్ట్రం ఇప్పటికే చాలా బాధలు అనుభవించిందని, ఇప్పటి ప్రభుత్వమైనా పరిస్థితిని చక్కదిద్దాలని షర్మిల సూచించారు. గడిచిన 10 సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ఇంతవరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం తాను ఇచ్చిన హామీలతోపాటు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## డిప్యూటేషన్‌పై ఏపీకి రానున్న తెలుగు ఐఏఎస్ కృష్ణతేజ



**విశ్వంభర, విజయవాడ:** కేరళ క్యాడర్ కు చెందిన తెలుగు యువ ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజ డిప్యూటేషన్‌పై ఏపీకి రానున్నారు. కృష్ణతేజ ప్రస్తుతం కేరళలోని త్రిసూర్ జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్నారు. ఆయన కేరళ నుంచి ఏపీకి మూడేళ్ల పాటు డిప్యుటేషన్ కు కేంద్రం తాజాగా అనుమతి మంజూరు చేసింది. కృష్ణతేజ కేరళలో సమర్థుడైన ఐఏఎస్ అధికారిగా పేరుతెచ్చుకున్నారు. విధి నిర్వహణలో ఆయన కృషికి గుర్తింపుగా 2 అంతర్జాతీయ పురస్కారాలు, 7 జాతీయ అవార్డులు వరించాయి. కాగా, డిప్యుటేషన్ పై ఏపీకి వస్తున్న కృష్ణతేజ... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించే మంత్రిత్వ శాఖల్లో పనిచేస్తారని తెలుస్తోంది. ఇటీవల ఏపీ ప్రభుత్వం కొలువుదీరినప్పుడే... పవన్ కల్యాణ్ ఓఎస్డీగా కృష్ణతేజ వస్తారంటూ ప్రచారం జరిగింది. కొన్ని వారాల కిందట కృష్ణతేజ అమరావతి వచ్చి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను కలిశారు. ఆ క్రమంలో, కృష్ణతేజ డిప్యుటేషన్ పై ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్టు తెలుస్తోంది.



## నిందితులను వదిలిపెట్టం

**• కఠిన చర్యలు తీసుకుంటాం**
**• సీఎం చంద్రబాబు ఆదేశాలు**

**విశ్వంభర, అమరావతి :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికను ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసిన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మైనర్ బాలిక హత్యాచార ఘటన నిందితులను వదిలే ప్రసక్తి లేదని వెల్లడించారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. నేరాలను రాష్ట్ర ప్రభుత్వం సహించదని అన్నారు. ఆడబిడ్డల రక్షణకు సంస్థాగత మెకానిజం కావాలని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు పిల్లలను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా దీంతో వారు బాలికను అత్యాచారం, హత్య చేసి హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో పడవేసామని అంగీకరించారు. అప్పటి నుంచి పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వరకు కూడా బాలిక ఆచూకి లభించలేదు.



## జగన్ మీద కేసు

**• రఘురామకృష్ణం రాజు ఫిర్యాదు**
**• తనను జగన్ కావాలనే కొట్టించాడని ఆరోపణ**


**విశ్వంభర, అమరావతి :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కేసు నమోదైంది. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరులోని నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ ప్రోత్సాహంతో అప్పటి సీబీఐ డీజీ పీవీ సునీల్‌కుమార్, కొందరు అధికారులు వేధించారని రఘురామకృష్ణ రాజు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి వేధించారని టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు తెలిపారు. అక్రమ కేసులు బనాయించి తనను కస్టడీలోకి తీసుకోవడమే కాకుండా.. హత్యాయత్నం చేశారని గుంటూరు జిల్లా ఎస్పీకి రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రఘురామకృష్ణ రాజు ఫిర్యాదు మేరకు ఏ1గా సునీల్‌కు మార్, ఏ2గా ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా వైఎస్ జగన్, ఏ 4గా అప్పటి సీబీఐ ఏఎస్పీ విజయ్‌పాల్, ఐ5గా జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు తదితర అంశాలకు సంబంధించి పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. వీటిలో నాన్‌బయిలబుల్ సెక్షన్లుకూడా ఉన్నట్లు సమాచారం.

# అంతర్జాతీయ క్రికెట్లో ముగిసిన ఆండర్సన్ శకం

- టెస్టు క్రికెట్ కు వీడ్కోలు పలికిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్
- వెస్టిండీస్ తో ముగిసిన టెస్టే ఆండర్సన్ కు చివరి టెస్టు
- కెరీర్ లో 188 టెస్టులాడి 704 వికెట్లు తీసిన ఆండర్సన్
- అరుదైన రికార్డులు సొంతం చేసుకున్న లెజెండరీ ఫాస్ట్ బౌలర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లండ్ సీనియర్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్ తన కెరీర్ లో చివరి టెస్టు ఆడేశాడు. వెస్టిండీస్ తో లార్డ్స్ మైదానంలో జరిగిన టెస్టు మ్యాచ్ తో ఆండర్సన్ అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. ఈ నెల 10న మొదలైన ఈ మ్యాచ్ కేవలం మూడ్రోజుల్లోనే ముగియగా, ఇంగ్లండ్ జట్టే విజయం సాధించింది. ఈ టెస్టులో ఆండర్సన్ రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 4 వికెట్లు తీశాడు. 41 ఏళ్ల ఆండర్సన్ ఇంగ్లండ్ క్రికెట్ జట్టు చరిత్రలోనే నికార్సయిన ఫాస్ట్ బౌలర్ గా నిలిచిపోతాడు. తన పేస్, స్వింగ్ తో మేటి బ్యాట్స్ మెన్లను సైతం హడలెత్తించడం ఆండర్సన్ కే చెల్లింది. ఇప్పటికే వన్డేలు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఆండర్సన్... ఇప్పుడు టెస్టు ఫార్మాట్ నుంచి కూడా తప్పుకున్నాడు. కెరీర్ లో ఇప్పటిదాకా 188 టెస్టులు ఆడిన ఆండర్సన్ 704 వికెట్లు తీసి సత్తా చాటాడు. టెస్టు క్రికెట్లో 700 వికెట్ల మైలురాయిని అందుకున్న ఒకే ఒక్క ఫాస్ట్ బౌలర్ ఆండర్సన్. టెస్టు క్రికెట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఆండర్సన్ మూడో స్థానంలో ఉన్నాడు. మొదటి స్థానంలో శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ (800), రెండో స్థానంలో ఆసీస్ లెజెండ్ షేన్ వార్న్ (708)) ఉన్నారు. వీరిద్దరూ స్పిన్నర్లే. ఆండర్సన్ తన టెస్టు కెరీర్ లో 32 సార్లు 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఈ రైట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్ తన టెస్టు కెరీర్ లో అత్యధిక వికెట్లు భారత్ పైనే పడగొట్టాడు. ఆండర్సన్ భారత్ తో 39 టెస్టుల్లో 149 వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాపై 39 టెస్టుల్లో 117 వికెట్లు సాధించాడు. ఇక, తన చివరి టెస్టులోనూ ఆండర్సన్ ఓ అరుదైన రికార్డు నమోదు చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో 40 వేల బంతులు విసిరిన తొలి ఫాస్ట్ బౌలర్ గా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (44,039), అనిల్ కుంబ్లే (40,850), షేన్ వార్న్ (40,705) మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు. వీరు ముగ్గురూ స్పిన్నర్లే. అత్యధిక బంతులు విసిరిన బౌలర్లలో ఆండర్సన్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఆండర్సన్ 194 వన్డేల్లో 269 వికెట్లు, 19 అంతర్జాతీయ టీ20 పోటీల్లో 18 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ లో ఒకే ఒక్క అర్ధం సెంచరీ సాధించాడు. అది కూడా టెస్టుల్లో. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ఆండర్సన్ రికార్డు మామూలుగా లేదు. 297 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లు ఆడిన ఆండర్సన్ 1,122 వికెట్లు తీయడం విశేషం.




# గౌతమ్ గంభీర్‌కు షాకిచ్చిన బీసీసీఐ..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) ఏకగ్రీవంగా సిఫార్సు చేసిన నేపథ్యంలో భారత కొత్త ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ధృవీకరించింది. ఇప్పుడు భారత మాజీ ఓపెనర్ సహాయక సిబ్బందిపై బీసీసీఐ దృష్టిపడింది. రాహుల్ ద్రవిడ్ మాదిరిగా భారత బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్, బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్ పదవీకాలం కూడా టీ20 ప్రపంచ కప్‌తో ముగిసింది. ఈ టోర్నీ అనంతరం రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసిపోవడంతో అతడి స్థానంలో గంభీర్‌కు చోటు దక్కింది. సాధారణంగా, ప్రధాన కోచ్‌కి తన సొంత సహాయక సిబ్బందిని ఎంచుకోవడానికి బీసీసీఐ అనుమతిస్తుంది. ఇది గంభీర్‌కు భిన్నంగా ఏమీ ఉండదు. అయితే, బౌలింగ్ కోచ్, ఫీల్డింగ్ కోచ్‌గా భారత మాజీ ఓపెనర్ సూచించిన పేరును బోర్డు తిరస్కరించింది.

### గంభీర్ అభ్యర్థన తిరస్కరణ :

భారత మాజీ పేసర్ ఆర్ వినయ్ కుమార్‌ను బౌలింగ్ కోచ్‌గా తీసుకోవాలని గంభీర్ ఆసక్తి కనబరిచాడు. కానీ, బోర్డు అతనిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. అలాగే, దక్షిణాఫ్రికా దిగ్గజం ఐపీఎల్‌లోని వివిధ జట్లతో ఆడిన జాంటీ రోడ్స్ లక్నో సూపర్ జెయింట్స్‌లో గంభీర్ తో కలిసి పనిచేశాడు. అయితే సపోర్టు స్టాఫ్‌లో విదేశీయుడిని తీసుకోవడానికి బీసీసీఐ ఆసక్తి చూపడం లేదు. గత ఏడు ఏళ్లుగా భారత్ పూర్తిగా స్థానిక సహాయక సిబ్బంది తోనే పనిచేస్తోంది. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని మార్చడానికి బోర్డు ఇష్టపడలేదు. ఈ క్రమంలో తాను సూచించిన వారికే కోచింగ్ సహాయక సిబ్బందిగా అవకాశం ఇవ్వాలని గౌతమ్ గంభీర్ షరతు విధించాడనే వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలోనే టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా జాంటీ రోడ్స్ పేరును గంభీర్ సిఫార్సు చేయగా, బీసీసీఐ అందుకు తిరస్కరించినట్లు నివేదికలు వెల్లడించాయి. టీమిండియా సపోర్ట్ స్టాఫ్ మొత్తం భారతీయులే ఉండాలని బీసీసీఐ స్పష్టం చేసినట్టుగా 'హిందూస్తాన్ టైమ్స్' స్టోరీ పేర్కొంది.

### దిలీప్‌కు చోటు దక్కే ఛాన్స్ :

రోడ్స్ పేరు చర్చకు రాగా ఆల్-ఇండియన్ సపోర్ట్ స్టాఫ్‌ని ఉంచాలని బోర్డు నిర్ణయించిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీని ప్రకారం.. దిలీప్‌కు మళ్లీ తలుపులు తెరచుకున్నాయి. అతను తన పదవీకాలంలో భారత జట్టుతో అద్భుతంగా పనిచేసాడు. మునుపటి కోచింగ్ స్టాఫ్‌లోని సభ్యుడు తదుపరి ప్రధాన కోచ్‌తో కొనసాగడం కూడా కొత్త కాదు. 2019 వన్డే ప్రపంచ కప్ తర్వాత సంజయ్ బంగర్ స్థానంలో రాథోర్ రవిశాస్త్రి కోచింగ్ టీమ్‌లో చేరాడు. అలా ద్రవిడ్ పదవీకాలం వరకు కొనసాగాడు. ఇప్పుడు, దిలీప్‌కు కూడా అలాగే చేసే ఛాన్స్ ఉంది. ఎన్‌సీఏ హెడ్‌గా ఉన్న భారత మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ప్రస్తుతం జింబాబ్వేలో యువ భారత టీ20 జట్టును పర్యవేక్షిస్తున్న లక్ష్మణ్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న వన్డే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు కోచింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడని గంభీర్ సూచించినట్లు తెలుస్తోంది. త్వరలో గంభీర్‌తో పాటు తన సొంత సహాయక సిబ్బంది కూడా చేరనున్నారు. కేకేఆర్‌లో అసిస్టెంట్ కోచ్‌గా గంభీర్‌తో కలిసి పనిచేసిన భారత మాజీ ఆటగాడు అభిషేక్ నాయర్‌కు కూడా కొత్త సహాయక సిబ్బందిలో చోటు దక్కే అవకాశం ఉంది.

# ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ సరికొత్త రికార్డు..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లాండ్ టెస్టు జట్టు కెప్టెన్, ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ సరికొత్త రికార్డును నమోదు చేశాడు. తద్వారా టెస్ట్ ఫార్మాట్లో ప్రపంచంలో మూడో క్రికెటర్‌గా, ఇంగ్లాండ్ తొలి ఆటగాడిగా నిలిచాడు. సొంతగడ్డపై ఇంగ్లండ్ జట్టు వెస్టిండీస్ తో టెస్ట్ సిరీస్ ఆడుతుంది. ఈ క్రమంలో ఇరు జట్ల మధ్య బుధవారం తొలి టెస్ట్ మొదలైంది. స్టోక్స్ టెస్టుల్లో అరుదైన ఫీట్ నమోదు చేశాడు. ఇంగ్లండ్ తరపున ఆరువేలకు పైగా పరుగులు సాధించడంతోపాటు, రెండు వందలకుపైగా వికెట్లు తీసిన తొలి ప్లేయర్ గా రికార్డు నమోదు చేశాడు వెస్టిండీస్ ఆల్ రౌండర్ గ్యారీ సోబర్స్ 93 టెస్టుల్లో 8,032 పరుగులు చేయగా.. 235 వికెట్లు తీశాడు. సౌతాఫ్రికా లెజెండ్ జాక్వెస్ కలిస్ 166 టెస్టుల్లో 13,289 పరుగులు చేసి 292 వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరి తరువాత స్థానంలో బెన్ స్టోక్స్ నిలిచాడు. స్టోక్స్ వెస్టిండీస్ తో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ లో రెండో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే బ్యాటర్ కిర్క్ మెకెంజీని అవుట్ చేయడంతో 200 టెస్ట్ వికెట్లు అందుకున్నాడు. ఇప్పటి వరకు స్టోక్స్ 103 టెస్టుల్లో 200 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో 13 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలతో 35.30 సగటుతో 6,320 పరుగులు చేశాడు. టెస్టుల్లో బెన్ స్టోక్స్ అత్యుత్తమం 258 పరుగులు. వెస్టిండీస్ తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లండ్ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది. తొలి ఇన్నింగ్స్ లో వెస్టిండీస్ 121 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ జట్టు 371 పరుగులు చేసింది. ఈ క్రమంలో రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన వెస్టిండీస్ జట్టు రెండోరోజు (గురువారం) ఆట ముగిసే సమయానికి 79 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఫలితంగా ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే వెస్టిండీస్ మరో 171 పరుగులు చేయాల్సి ఉంది. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి వెస్టిండీస్ బ్యాటర్లు క్రీజులో నిలబడి 171 పరుగులు చేయడం అసాధ్యమనే చెప్పొచ్చు. దీంతో తొలి టెస్టులో ఇంగ్లాండ్ జట్టు విజయం సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.




# బీమా రంగానికి భారీ రాయితీలు!

## ఆశలు రేపుతున్న నిర్మలమ్మ పద్దు..




**విశ్వంభర, బిజినెస్ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న పార్లమెంట్ లో బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. దీనికోసం దేశంలో ప్రజలందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బడ్జెట్ లో లభించే రాయితీలు, మినహాయింపులు, ప్రోత్సాహకాలపై లెక్కలు వేసుకుంటున్నారు. బీమా రంగ నిపుణులు కూడా బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. బీమా రంగానికి ఇచ్చే రాయితీల కోసం ఎదురు చూస్తున్నారు.

### ఎదురు చూపులు..

జీవిత బీమాపై జీఎస్టీ తగ్గించడం, ఆరోగ్య పథకాలపై పన్ను మినహాయింపు కోసం బీమా రంగ నిపుణులు ఎదురు చూస్తున్నారు. దీనివల్ల దేశంలో బీమా రంగం మరింత ముందుకు వెళ్లడంతో పాటు ప్రజలకు ఆరోగ్య సంరక్షణ లభిస్తుందని చెబుతున్నారు. బీమా ఉత్పత్తులను మరింత ఆకర్షణీయంగా, విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని, అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరిస్తున్నారు.

### ఆరోగ్య బీమాలకు ఆదరణ..

దేశంలో బీమా రంగం ఇటీవల క్రమంగా ముందుకు సాగుతోంది. ఆరోగ్యంపై ప్రజలు అనేక జాగ్రత్తలు తీసుకోవడం వల్ల బీమా పాలసీలకు ఆదరణ కూడా పెరిగింది. గతంలో పట్టణాలు, నగర వాసులకే వీటిపై అవగాహన ఉండేది. ఇప్పుడు గ్రామీణులు సైతం పాలసీలు కడుతున్నారు. కేంద్ర బడ్జెట్లో బీమా రంగానికి ప్రోత్సాహకాలు పెంచితే మరింత ఊతం లభిస్తుందని ఆ రంగ నిపుణులు భావిస్తున్నారు.

### పరిమితి పెరిగేనా..

కేంద్ర బడ్జెట్‌లో తాము ఆశిస్తున్న ప్రయోజనాలను దేశంలోని ప్రముఖ బీమా సంస్థల నిపుణులు తెలిపారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ తగ్గించడం వారి ప్రధాన అంచనాలలో ఒకటి. అలాగే ప్రజలు, వారిపై ఆధారపడిన వారికి, సీనియర్ సిటిజన్లలైన తల్లిదండ్రులకు చెల్లించే ఆరోగ్య బీమా ప్రీమియాల కోసం సెక్షన్ 80డీ కింద మినహాయింపు పరిమితి పెరుగుదల ఆశిస్తున్నారు.

### ఆశిస్తున్న ప్రయోజనాలు..

యూనియన్ బడ్జెట్ లో రిస్క్ మేనేజ్‌మెంట్, రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ క్రింది చర్యలను పరిగణించాలని కోరుతున్నారు. ఆరోగ్య బీమా ప్రీమియాలపై పన్ను మినహాయింపు గరిష్ట పరిమితిని రూ. 75 వేలకు పెంచాలి. ఎలక్ట్రిక్ వాహనాలపై (ఈవీలు) బీమా కోసం ఆర్థిక మద్దతు, పన్ను ప్రయోజనాలను కల్పించాలి. సైబర్ రిస్క్, డేటా ఉల్లంఘనలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి సైబర్ బీమా కోసం, అలాగే చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు పన్ను ప్రయోజనాలను అందించాలి. కార్మికుల ఆరోగ్య రక్షణలో భాగంగా వారికి ఆరోగ్య బీమాలను ఆయా యజమానులు తప్పనిసరిగా చేయించాలి. జీవిత బీమా ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాలి. జీవిత బీమా యాన్యుటీ, పెన్షన్ ఉత్పత్తులను నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్ పీఎస్)తో అనుసంధానం చేయాలి. అధిక విలువ కలిగిన సాంప్రదాయ జీవిత బీమా ప్లాన్‌లకు (రూ. 5 లక్షల కంటే ఎక్కువ వార్షిక ప్రీమియం) దీర్ఘకాలిక మూలధన లాభం పన్ను విధానాన్ని ప్రవేశపెట్టాలి. బీమా ఉత్పత్తుల స్థోమత, యాక్సెసిబిలిటీని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. పన్ను ప్రోత్సాహకాలను పెంచడం వల్ల ఎక్కువ మంది బీమా చేయించుకునే అవకాశం కలుగుతుంది. డిజిటల్ ఇన్నోవేషన్‌కు మద్దతు ఇచ్చే నియంత్రణ సంస్కరణలు చేపట్టాలి.

# ఆ ఈవీ స్కూటర్‌పై ఫ్లిప్‌కార్ట్‌లో బంపర్ ఆఫర్..

## రూ.50 వేలకే ఆ స్కూటర్ మీ సొంతం



**విశ్వంభర, బిజినెస్ :** ప్రస్తుతం భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల హవా నడుస్తుంది. ఈ నేపథ్యంలో టాప్ కంపెనీల నుంచి స్టార్టప్ ల వరకు కొత్త మోడల్స్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేస్తున్నాయి. గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహించే దిశగా ఒక ఉత్తేజకరమైన చర్యలో ఎస్ఏఆర్ గ్రూప్‌నకు సంబంధించిన ఈ-మొబిలిటీ విభాగం, లెక్ట్రిక్స్ తమ శక్తివంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్ లెక్ట్రిక్స్ ఎల్ఎక్స్ఎస్ 2.0ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈవీ స్కూటర్ పై తాజా ఆఫర్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. లెక్ట్రిక్స్ ఎల్ఎక్స్ఎస్ 2.0పై రూ. 5,000 పరిమిత-సమయ తగ్గింపును ప్రకటించింది. బ్యాటరీ లేని వెర్షన్ కోసం దాని ధరను రూ. 49,999కి తగ్గించింది. సాధారణంగా ఈ స్కూటర్ ప్రామాణిక ధర రూ. 75999. అయితే అయితే కస్టమర్‌లు బ్యాటరీ సబ్ స్క్రిప్షన్ మోడల్‌ను ఎంచుకుంటే తగ్గింపు ధర వర్తిస్తుంది. అంటే బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ని ఎంచుకునే వారికి, ఎలక్ట్రిక్ స్కూటర్ రూ. 49,999కి అందుబాటులో ఉంది. బ్యాటరీకి అదనంగా నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రుసుము 999 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మోడల్ బ్యాటరీపై జీవితకాల వారెంటీ ఉంటుంది. లెక్ట్రిక్స్ ఎల్ఎక్స్ఎస్ 2.0పై లెక్ట్రిక్స్ 3 సంవత్సరాలు లేదా 30,000 కిమీల సమగ్ర వారంటీని అందిస్తుంది. 50 కిమీల రోజువారీ వినియోగంతో ఈ వారంటీ దాదాపు 20 నెలల పాటు చెల్లుబాటు అవుతుంది. ఆర్డర్ చేసిన 2-3 వారాల్లో డెలివరీ చేస్తామని కంపెనీ హామీ ఇస్తుంది.


## నిర్యాణము



స్వస్తిశ్రీ చాంద్రమాన క్రోధి నామ సంవత్సర జ్యేష్ఠ బహుళ ద్వాదశి అనగా తేది. 02-07-2024 మంగళవారం నాడు సా॥ 5.30 ని॥లకు మా తండ్రిగారు **అల్లైన వెంకట రమణమూర్తి** గారు మమ్ములను దఃఖసాగారంలో ముంచి స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

**పెద్దకర్మ** తేది. 13-07-2024 శనివారం నాడు మా స్వగృహమందు జరిపించుటకు దైవజ్ఞులు నిర్ణయించిరి. కావున తమరు విచ్చేసి మా తండ్రిగారి ఆత్మకు శాంతిని చేకూర్చగలరని కోరుతున్నాము.

వైకుంఠ సమారాధన **(అన్నసంతర్పణ)** తేది. 13-07-2024 శనివారం మధ్యాహ్నం నుండి

**కార్యస్థలం**

2-3-532, ఫ్లాట్ నెం. 48, శ్రీనివాస శంకర్ కృప,
న్యూ నాగోల్ కాలనీ, ఆండల్ స్వీట్స్ షాప్ దగ్గర,
కొత్తపేట్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ,

ఇట్లు
**అల్లైన వెంకట శ్రీ హర్ష**
సెల్. 9885155385



# గ్రాండ్‌గా బాలయ్య గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్

టాలీవుడ్ స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ గురించి తెలియని వారుండరు. ఆయన నటన, డైలాగ్ డెలివరీకి చిన్న పిల్లల నుంచి పండు ముసలి వాళ్ల వరకు ఫ్యాన్సే. ఆయన సినిమా అంటే థియేటర్లు హౌస్ఫుల్ కావాల్సిందే. బాలయ్య సినిమా అంటే మినిమమ్ ఎంటర్టైన్మెంట్ గ్యారంటీ అనే ధీమా ప్రేక్షకుల్లో ఉంటుంది. అలా ఇప్పటికే దాదాపు 100కుపైగా సినిమాలు చేసిన ఆయన చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి ఈ ఏడాదితో 50 ఏళ్ల పూర్తవుతుంది. బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో అరంగేట్రం చేసి 2024 ఆగస్టు 30తో 50ఏళ్లవుతుంది. ఆయన నటించిన తొలి సినిమా 'తాతమ్మ కల' 1974 ఆగస్టు 30న రిలీజ్ అయింది. ఈ సినిమాకు ఆయన తండ్రి, స్వర్గీయ ఎన్టీఆర్ దర్శకత్వం వహించారు. ఈ నేపథ్యంలో బాలయ్య సినీ ప్రయాణంలో కళారంగానికి చేసిన కృషి, సేవలకుగాను తెలుగు ఇండస్ట్రీ ఆయన్ను ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీన ఘనంగా సన్మానించాలని నిర్ణయించింది. ఈ మేరకు సన్మాన వేడుకకు అంగీకారం తెలపాల్సిందిగా ఇండస్ట్రీ మెంబర్లు తాజాగా బాలకృష్ణను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి బాలయ్య అంగీకరించారు. 50ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో బాలయ్య హీరోగా 108 సినిమాలు చేశారు.

# పాపం షాలిని.. ఇప్పటికీ అర్జున్ రెడ్డి బ్యూటీగానే..

పాత్ బ్రేకింగ్ సినిమాతో ఎంట్రీ ఇవ్వడం మ్యాటర్ కాదు.. అది మన కెరీర్‌కు ఎంతవరకు యూజ్ అయిందనేది మ్యాటర్. ఆఫర్స్ రానపుడు.. అవకాశాల వేటల వెనకబడినపుడు ఏ సినిమాతో ఎంట్రీ ఇచ్చినా వృథానే. ఇక్కడ ఓ హీరోయిన్‌ను చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. సెన్సేషనల్ సినిమాతో ఎంట్రీ ఇచ్చినా.. సింగిల్ ఆఫర్ కోసం వేచి చూస్తున్న ఆ బ్యూటీ ఎవరో తెలుసా..? కొందరు హీరోయిన్లు ఎన్ని సినిమాలు చేసినా మొదటి సినిమా ముద్ర మాత్రం అలాగే ఉండిపోతుంది. అలాంటి బ్యూటీనే షాలిని పాండే. థియేటర్ ఆర్టిస్ట్ కావడంతో చిన్న చిన్న ఎక్స్‌ప్రెషన్స్ కూడా అద్భుతంగా పలికిస్తారు ఈ బ్యూటీ. అర్జున్ రెడ్డి సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన షాలిని.. ఆ తర్వాత ఆ రేంజ్ మ్యాజిక్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. అర్జున్ రెడ్డి తర్వాత విజయ్ దేవరకొండ రేంజ్ మారిపోయింది. హిట్టు ఫ్లాపులతో పనిలేకుండా ఈయన యూత్ ఐకాన్ అయిపోయారు. ఇప్పటికీ అదే ఇమేజ్ రౌడీ బాయ్‌కు బాగా హెల్ప్ అవుతుంది. అలాగే సందీప్ రెడ్డి వంగా సైతం పాన్ ఇండియన్ డైరెక్టర్ అయిపోయారు. కానీ అర్జున్ రెడ్డిలో నటించిన షాలిని పాండేకు మాత్రం ఆ ఇమేజ్ అంతగా వర్కవుట్ అవ్వలేదు. అర్జున్ రెడ్డి తర్వాత మహానటి, ఎన్టీఆర్ కథానాయకుడు లాంటి సినిమాలు చేసారు షాలిని పాండే. అలాగే 118, ఇద్దరి లోకం ఒకటే సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. కానీ వీటిలో ఏ ఒక్కటి కూడా షాలిని పాండే కెరీర్‌కి హెల్ప్ అవ్వలేదు. హిందీలోనూ అడపా దడపా ఆఫర్స్‌తోనే నెట్టుకొస్తున్నారు అర్జున్ రెడ్డి బ్యూటీ. ప్రస్తుతం అవకాశాల కోసం గ్లామర్ షో చేయడం తప్ప మరో ఆప్షనే లేకుండా పోయింది ఈ భామకు. అందుకే ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో కొత్త కొత్త ఫోటోషూట్స్ చేస్తూనే ఉంటారు షాలిని. తాజాగా మరోసారి ఇదే చేసారు ఈ భామ. షాలిని కొత్త ఫోటోషూట్‌కు అదిరిపోయే రెస్పాన్స్ వస్తుంది. మొత్తానికి చూడాలిక.. షాలిని దశ మార్చేసే సినిమా ఎప్పటికి వస్తుందో..?





# కుంభస్థలం బద్దలు కొట్టబోతున్న నిఖిల్

మనకు ఈ చిన్న చిన్నవి వర్కవుట్ అవ్వవు.. కొడితే ఒకటే జాక్‌పాట్.. కుంభస్థలం బద్ధలై పోవాలంతే అంటున్నారు నిఖిల్. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న ఈయనకు ఇప్పుడు మంచి మార్కెట్ ఉంది.. ఇమేజ్ కూడా బానే ఉంది. కానీ ఇది సరిపోదంటున్నారీయన. అందుకే ప్లాన్ మార్చారు. అది గానీ వర్కవుట్ అయితే.. దెబ్బకు పాన్ ఇండియన్ స్టార్ అయిపోతారు నిఖిల్. హ్యాపీడేస్ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైనా.. నిఖిల్‌కు హీరోగా గుర్తింపు తీసుకొచ్చింది మాత్రం స్వామి రారా సినిమానే. సుధీర్ వర్మ తెరకెక్కించిన ఆ సినిమాతోనే సోలో హీరోగా మార్కెట్ తెచ్చుకున్నారు నిఖిల్. ఆ తర్వాత కార్తికేయ, కేశవ, ఎక్కడికి పోతావు చిన్నవాడా, కార్తికేయ 2 లాంటి సినిమాలతో నిఖిల్ జర్నీ ఎదురులేకుండా సాగుతుంది. కార్తికేయ 2 తర్వాత నిఖిల్ రేంజ్ మరింత పెరిగింది. చందూ మొండేటి తెరకెక్కించిన ఈ సినిమా ఏకంగా 120 కోట్లకు పైగా వసూలు చేసింది. హిందీలోనూ రప్ఫాడించింది కార్తికేయ 2. ఈ నమ్మకంతోనే ప్రస్తుతం రెండు పాన్ ఇండియన్ సినిమాలు చేస్తున్నారు నిఖిల్. అందులో ఒకటి స్వయంభు కాగా.. మరోటి ది ఇండియా హౌజ్. ఇండియా హౌజ్ సినిమాని రామ్ చరణ్ నిర్మిస్తున్నారు. ఈ మధ్యే షూటింగ్ మొదలైంది. సయి మంజ్రేకర్ ఇందులో హీరోయిన్. అలాగే స్వయంభు షూటింగ్ చాలా రోజులుగా జరుగుతుంది. భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై తాజాగా ఓ అప్‌డేట్ వచ్చింది. ఇది ఒకటి కాదు.. రెండు భాగాలుగా రాబోతుందని. భారీ బడ్జెట్‌తోనే వస్తుంది స్వయంభు. నిఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో వస్తుంది స్వయంభు. ఈ కథ రాసుకున్నపుడే దర్శకుడు ఏకంగా నాలుగు భాగాలు చేయాలనుకున్నట్లు తెలుస్తుంది. కాకపోతే అంత వర్కవుట్ అవ్వదు కాబట్టి 2 భాగాలతో సరిపెడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. మొత్తానికి స్వయంభు, ఇండియన్ హౌజ్ సినిమాలతో తన మార్కెట్ మరింత పెంచుకోవాలని చూస్తున్నారు నిఖిల్.



## ఇండస్ట్రీలో త్వరగా ఎదగాలంటే
# అదే షార్ట్ కట్..

ప్రముఖ సింగర్ నోయెల్ మాజీ భార్య, నటి ఎస్తర్ నోరాన్హా తాజాగా క్యాస్టింగ్ కౌచ్ పై షాకింగ్ కామెంట్స్ చేసింది. సినిమా ఇండస్ట్రీలో ఎదగడానికి దేనికైనా సిద్ధమైతే కొంతమంది అడ్వాంటేజ్ తీసుకుంటారు అని అంటుంది ఎస్తర్ నోరాన్హా. సినీ ఇండస్ట్రీలో త్వరగా ఎదగాలి స్టార్ డమ్ రావాలి అని అనుకునేవారికి అదే షార్ట్ కట్ అని ఆమె అన్నారు. అలాగే సినిమా ఇండస్ట్రీలో మహిళలపై వేధింపులు ఎక్కువగా జరగడానికి కారణం ఇక్కడ ఉన్న పరిస్థితులే అని ఆమె చెప్పుకొచ్చారు. అలాగే ఆమె మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉంది. నేను అవకాశాల కోసం ఏదైనా చేస్తాను.. ఎంత దూరమైన వెళ్తాను అనుకునేవారు ఉంటారు. అలాంటి వారిని కొంతమంది లోబరుచుకుంటారు. అవకాశాల కోసం ఏం చేయస్తావ్ అనే వాళ్లు, అడ్వాంటేజ్ తీసుకునే వారు ఉంటారు. కానీ నేను అలాంటివి చేయను. నేను నా దారిలోనే వెళ్తాను అని మొండిగా ఉండే వారిని ఎవ్వరూ బలవంత పెట్టారు. ఆ ఛాయిస్ మాత్రం ఉంది అని అన్నారు ఎస్తర్ నోరాన్హా. చాలా మంది టాలెంట్ ను నమ్ముకొని ముందుకు వెళ్తున్నారని.. తాను కూడా అలానే తన టాలెంట్ ను, హార్డ్ వర్క్ ను నమ్ముకుంటున్నా అని తెలిపారు ఎస్తర్ నోరాన్హా. తన ప్రతిభ ద్వారా వచ్చే గుర్తింపునే నేను కోరుకుంటున్నా అని చెప్పుకొచ్చారు ఎస్తర్ నోరాన్హా. ఈ అమ్మడి కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# బెల్లీ ఫ్యాట్‌ను ఇవి తగ్గిస్తాయని అధ్యయనాలే నిరూపించేశాయి!

విసెరల్ ఫ్యాట్ అంటే పొట్టలో పేరుకుపోయే కొవ్వు. సరైన ఆహారం మరియు వ్యాయామం ద్వారా మాత్రమే దీనిని పరిష్కరించవచ్చు. కొన్ని మసాలాలు విసెరల్ కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అవి ఏంటంటే..

**పసుపు**

పసుపులో ఉండే కర్కుమిన్ యాంటీ ఆక్సిడెంట్. ఇది కాలేయం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. కొవ్వును కోల్పోవడానికి కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీఆక్సిడెంట్, శక్తివంతమైన యాంటీ వైరల్ లక్షణాలు ఉన్నాయి. శరీరంలో మంటను తగ్గించడంలో కర్కుమిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఊబకాయాన్ని నివారించడంలో కూడా సహాయపడుతుంది. రోజూ ఖాళీ కడుపుతో పసుపు నీళ్లు తాగడం వల్ల పొట్ట కొవ్వు తగ్గుతుంది.

**మిరియాలు**

నల్ల మిరియాలు యొక్క ప్రధాన భాగం పైపెరిన్,



కొత్త కొవ్వు కణాల పెరుగుదలను నిరోధించడంలో ముడిపడి ఉంది. నల్ల మిరియాలు కొవ్వు పేరుకుపోకుండా నిరోధించడం ద్వారా బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది.

**వెల్లుల్లి**

వెల్లుల్లి అతిగా తినడాన్ని నివారిస్తుంది. విటమిన్ B6, C, ఫైబర్ మరియు కాల్షియం బరువు నియంత్రణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బరువు తగ్గడానికి రోజూ రెండు మూడు వెల్లుల్లి రెబ్బలను నమలండి.

**దాల్చిన చెక్క**

యాంటీడయాబెటిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు థర్మోజెనిసిస్ లక్షణాలను కలిగి ఉంటుంది, దాల్చిన చెక్క బొడ్డు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ ఖాళీ కడుపుతో దాల్చిన చెక్క నీటిని తాగడం అలవాటు చేసుకోండి. దాల్చినచెక్కలో అనేక యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి, ఇవి గుండె మరియు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. దాల్చినచెక్క రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది మరియు గుండెపోటు, అధిక రక్తపోటు మరియు స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**అల్లం**

బరువు తగ్గాలనుకునే వారికి అల్లం బెస్ట్. క్రమం తప్పకుండా అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియను పెంచడానికి, కేలరీలను బర్న్ చేయడానికి మరియు పొట్టలోని కొవ్వును కాల్చడానికి సహాయపడుతుంది. ఎవరికైతే పొట్ట చుట్టూ కొవ్వు ఉంటుందో..వాళ్లు వీటిని తమ ఆహారంలో భాగం చేసుకుంటే కొవ్వు వెన్నలా కరిగిపోతుంది.

# నిమిషానికి ఎన్నిసార్లు మీరు కనురెప్పలు వేస్తారో తెలుసా?

మనిషి శరీరం నిజంగా ఒక అద్భుతమైన నిర్మాణం.. మనకు తెలియకుండానే మనలో ఎన్నో మార్పులు, ఎన్నో పనులు రోజూ జరుగుతాయి. మానవ అస్థిపంజరంలో 206 ఎముకలు ఉన్నాయని మీకు తెలుసా? ఇంకా మీ గురించి మీకే తెలియని కొన్ని ఆశ్చర్యపోయే వాస్తవాలు చూద్దామా..!

1. మీ కళ్ళు నిమిషానికి 20 సార్లు రెప్పపాటు చేస్తాయి. అంటే సంవత్సరానికి పది లక్షల సార్లు!
2. మీ చెవులు ఎప్పటికీ పెరగవు.
3. చెవిలో గులిమి నిజానికి ఒక రకమైన చెమట
4. నాలుక దాదాపు 8,000 రుచి మొగ్గలతో కప్పబడి ఉంటుంది, ప్రతి ఒక్కటి 100 కణాల వరకు మీ ఆహారాన్ని రుచి చూడడంలో మీకు సహాయపడతాయి!
5. మీరు మీ జీవితకాలంలో సుమారు 40,000 లీటర్ల ఉమ్మిని ఉత్పత్తి చేస్తారు. లేదా మరో విధంగా చెప్పాలంటే, సుమారు ఐదు వందల బాత్‌టబ్‌లను నింపడానికి తగినంత ఉమ్మిని ఉత్పత్తి చేస్తారు.
6. సగటు ముక్కు ప్రతిరోజూ ఒక కప్పు నాసికా శ్లేష్మం ఉత్పత్తి చేస్తుంది.
7. మీరు పడుకునే సమయం కంటే ఉదయాన్నే లేచినప్పుడు 1సెం.మీ పొడవుగా ఉంటారు. ఎందుకంటే పగటిపూట మీ ఎముకల మధ్య మృదువైన మృదులాస్థి స్క్వాష్ మరియు కుదించబడుతుంది.
8. మీరు రోజుకు 12 గంటలు నడిస్తే, సగటు వ్యక్తి ప్రపంచాన్ని చుట్టి రావడానికి 690 రోజులు పడుతుంది.
9. ఎప్పుడూ అలసిపోని ఏకైక కండరం గుండె.
10. ప్రతి నెలా మీ చర్మం యొక్క మొత్తం ఉపరితలం మారుతుంది. అంటే మీ జీవితంలో దాదాపు 1,000 రకాల చర్మాలు ఉన్నాయి!
11. శరీరం 2.5 మిలియన్ చెమట రంధ్రాలను కలిగి ఉంటుంది.
12. ప్రతి నిమిషం మీరు 30,000 పైగా చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తారు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com